Follow: @ANNTELUGU
02-10-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 251 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బీసీలకు అండగా నిలిచింది మేమే

- 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో అప్పీల్
- రిజర్వేషన్లు అడ్డుకునేలా కోర్టుల్లో గొడ్డలి పార్టీ పిటీషన్లు
- సంక్షేమం-అభివృద్ధి- సుపరిపాలనతో ప్రతిచోటా ఫలితాలు
- రేపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**రేపల్లె, మహా :** బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది... నిలిచేది తామేనని ముఖ్యమమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజావేదికలో సీఎం ప్రసంగించారు. నాడు బీసీలకు రాజకీయంగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారని.. తాను వారికి అండగా నిలబడి ప్రోత్సహించానని సీఎం అన్నారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తెచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గొడ్డలి పార్టీ మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### ఎస్ఐఆర్ ప్రక్రియతో ప్రజాస్వామ్యం ధ్వంసం

- సీఈసీ రాజీనామా చేసి అపూర్వర్గా మారాలి
- మోదీ, షా పై విచారణకు రాహుల్ డిమాండ్

02



### పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ రాజా వారింగ్ రాజీనామా

- కేసీ వేణుగోపాల్‌కు రాజీనామా లేఖ
- చన్నీ వర్గంతో విభేదాల నేపథ్యంలో మార్పు

03



### ఈసీ నిర్ణయం మార్చుకోకుంటే హైదరాబాద్ తగలబడిపోతుంది

- దానం నాగేందర్ స్ట్రాంగ్ వార్నింగ్

02



## నటి రన్యారావుకు భారీ షాక్

- రూ.89 కోట్ల జరిమానా.

**బెంగళూరు, మహా. :** బంగారం అక్రమ రవాణా కేసులో నటి రన్యారావుకు కస్టమ్స్ శాఖ భారీ జరిమానా విధించింది. ఈ కేసులో ఆమెకు రూ.89 కోట్ల జరిమానా విధిస్తూ కస్టమ్స్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కస్టమ్స్ జాయింట్ కమిషనర్ సందీప్ ఈ మేరకు నోటీసు జారీ చేసినట్లు తెలుస్తోంది. కేసుకు సంబంధించిన 399 పేజీల దర్యాప్తు నివేదికను కూడా అధికారులు విడుదల చేశారు. 2024 మార్చి 7 నుంచి 2025 ఫిబ్రవరి 18 మధ్య కాలంలో రన్యారావు, ఆమె సహచరుడు మిగతా 3వ పేజీలో

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

### రెండు డీఏలకు కేబినెట్ ఆమోదం

- రాష్ట్ర ఖజానాపై రూ.2,500కోట్ల భారం
- సీఎం రేవంత్ అధ్యక్షతన కీలక నిర్ణయాలు
- ఎల్ నినో ప్రభావంపై త్వరలో అఖిలపక్ష సమావేశం
- తెలంగాణ డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీకి మంత్రివర్గ ఆమోదం



**హైదరాబాద్, మహా :**
రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 నుంచి పెండింగుల్లో ఉన్న డీఏల్లో రెండు మంజూరు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బకాయిలను వాయిదాల్లో చెల్లిస్తారు. ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరుకు నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా 2,500 కోట్ల రూపాయల భారం పడనుందని అయినప్పటికీ ఉద్యోగుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సుమారు నాలుగు గంటల పాటు క్యాబినెట్ మిగతా 2వ పేజీలో



## ఖైరతాబాద్ ఉప ఎన్నికకు బ్రేక్

### హైకోర్టుకు ఈసీ కీలక సమాచారం

- పాత ఎన్నికల పిటిషన్ తేలే వరకు నోటిఫికేషన్ లేదన్న ఎన్నికల సంఘం
- తమిళనాడులో ఇలాగే వాయిదాపడ్డ ఐదు ఉప ఎన్నికలు

**హైదరాబాద్, మహా :** ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీని నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకురాలు పి. విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ మంగళవారానికి వాయిదా పడింది. ఇదే సమయంలో ఖైరతాబాద్ స్థానానికి సంబంధించిన ఎన్నికల పిటిషన్ న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నందున ప్రస్తుతానికి ఉప ఎన్నిక నిర్వహించబోమని ఎన్నికల సంఘం హైకోర్టుకు స్పష్టం చేసినట్లు వెల్లడించింది.

**నోటిఫికేషన్ నిలిపివేయాలని విజయారెడ్డి పిటిషన్**

2024లో దానం నాగేందర్ ఎన్నికను సవాల్ చేస్తూ విజయారెడ్డి హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో కుటుంబానికి సంబంధించిన ఆస్తుల మిగతా 2వ పేజీలో



## జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ దూకుడు

- సెప్టెంబర్‌లో రూ.5,327 కోట్ల దేశీయ జీఎస్టీ ఆదాయం.. 18 శాతం వృద్ధి నమోదు.

### ఇల్లే లేదు..

## నాకు హోటల్స్ ఉన్నాయి



- ఒక హోటల్.. మూడు హోటల్స్ అయ్యాయి
- కేటీఆర్ వ్యాఖ్యలు వైరల్

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలకు కౌంటర్ ఇస్తూ, "అవును నాకు హోటళ్లు ఉన్నాయి.. వ్యాపారం చేస్తే తప్పేంటి?" అని చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. 2006లో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఉన్న సమయంలోనే తాను హోటల్ ప్రారంభించానని.. 2009 ఎన్నికల అఫిడవిట్‌లోనూ తన ఆస్తులు, వ్యాపార వివరాలను స్పష్టంగా వెల్లడించానని తెలిపారు. తాను అఫిడవిట్‌లో చెప్పిన విషయాన్నే మళ్లీ కొలంబస్ కనుగొన్నట్టు రేవంత్ ఫోజులు కొడుతున్నారని అన్నారు. వ్యాపారం చేసుకోవడం తప్పా. ఒక హోటల్ మూడు హోటల్స్ అయినయి. నేను వ్యాపారం చేసి ఉంటే అవి పది అయ్యేవి. వ్యాపారం చేయడం తప్పా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



## బీఆర్ఎస్‌తో పొత్తే లేదు

- తెలంగాణలో ఒంటరిగానే పోటీ: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో బీఆర్ఎస్‌తో తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు పెట్టుకోదని కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో జరిగే ఎన్నికలు ఏవైనా సరే పొత్తులు లేకుండా బీజేపీ స్వతంత్రంగా పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు ఉంటుందన్న ప్రచారంపై ఓ విలేకరి ప్రశ్నించగా.. "బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## ప్రజా దర్బార్



### ఆదిలాబాద్ నియోజకవర్గ నలుమూలలనుండి తరలివచ్చిన ప్రజలు

- తమ సమస్యలపై కంది శ్రీనివాస రెడ్డికి వినతులు
- పరిష్కారానికి కృషి చేస్తానని కంది హామీ

06



## 2027 వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

అక్టోబర్ 10న భారత్-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్

03



# ఈసీ నిర్ణయం మార్చుకోకుంటే హైదరాబాద్ తగలబడిపోతుంది

**హైదరాబాద్ సిటీ, మహా :** నగరంలో ఓట్ల తొలగింపు వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ అంశంపై మాజీ మంత్రి దానం నాగేందర్ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ తన వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ మొత్తం తగలబడిపోతుందని వ్యాఖ్యానించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు బీజేపీతో కుమ్మక్కై పనిచేస్తున్నారని దానం నాగేందర్ ఆరోపించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లోనే సుమారు 20 వేల ఓట్లను ఏకపక్షంగా తొలగించారని పేర్కొన్నారు. ఢిల్లీ కేంద్రంగా బీజేపీ నాయకులు వ్యవస్థీకృతంగా 'ఓట్ చోరీ'కి పాల్పడుతున్నారని విమర్శించారు. స్థానికంగా ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. తన నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడే బాధ్యత తనపై ఉందని దానం నాగేందర్ తెలిపారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈసీ స్పందించకపోతే నిరసనలు, ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.



# మంద బాబురావు మృతి పట్ల సంతాపం

**ఆసుపత్రి బిల్లు చెల్లించిన డిసిసి అధ్యక్షుడు అయూబ్**

వరంగల్,గీసుకొండ మహా; వరంగల్ జిల్లా గీసుకొండ మండలం పోతరాజుపల్లె గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందించిన మంద బాబురావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ కన్నుమూశారు. వరంగల్ లోని ఆరుషి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ శ్రేణులు తీవ్ర విషాదానికి లోనయ్యారు. మంద బాబురావు మృతదేహాన్ని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలు పంచుకున్నారు. కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న జిల్లా అధ్యక్షుడు అయూబ్ తన మానవత్వాన్ని చాటుకున్నాడు. వెంటనే ఆసుపత్రి బిల్లును పూర్తిగా చెల్లించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించేలా సహకారం అందించారు.కాంగ్రెస్ పార్టీ కోసం మంద బాబురావు అందించిన సేవలను ఈ సందర్భంగా అయూబ్ స్మరించుకున్నారు. ఆయన మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాబురావు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని అయూబ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు అండగా నిలిచింది మేమే

( మొదటి పేజీ తరువాయి )

అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందన్నారు. తద్వారా 16,800 మంది పదవీ అవకాశాలు కోల్పోయారని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.." ఇప్పుడు మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లింది. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. 50 శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదని కోర్టులో వాదించారు. కోర్టు ఆ జీవోలను కొట్టేసింది. దీనిపై సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్తున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా పైకి తీసుకురావటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వ్యక్తులు.. మేం మెగా డీఎస్సీ తో ఉద్యోగాలు ఇస్తే ఆరోపణలు చేస్తున్నారు. 350 కేసులు కోర్టుల్లో వేసి నియామక ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెనుకబడిన వర్గాలపై ద్వేషంతో కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టించే రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా బీసీలను రాజకీయంగా అండగా నిలబడే బాధ్యతను మేం తీసుకుంటాం. ఈ ప్రాంతంలో బీసీ బిడ్డ అనగాని భగవంతరావు చక్కగా పనిచేశారు. ఇప్పుడు మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజల కోసం పనిచేస్తున్నారు. బీసీలుగా నాయకులు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించేది కూటమి ప్రభుత్వమే." అని ముఖ్యమంత్రి అన్నారు.

**జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం**

గడచిన 28 నెలలుగా ప్రతీ నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నాను. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నాను. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం. ప్రతినెలా నాలుగు మార్లు ప్రజల ముందుకు వస్తున్నాం. ప్రతీ నెలా 1 తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9 తేదీన మీ భూమి మీహక్కు కార్యక్రమంలో పాల్గొంటున్నాం. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఇక ప్రతిమూడో శనివారం పర్యావరణాన్ని కాపాడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి , 4వ శనివారం సంజీవని కార్యక్రమానికి హాజరవుతున్నాను. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతీ వ్యక్తికి, ప్రతీ కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గొడ్డలి పార్టీ నేతలు ప్రజలు కొట్టిన దెబ్బకు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం సృష్టించారు. కష్టంతో సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటికి రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు, బుల్లెట్ స్పీడ్ తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాదు మానవీయ కోణంలో ఆలోచించి జీవన ప్రమాణాలు పెంచడానికి చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున 20 స్థాయి మందికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమానంగా చేపడుతున్నాం. పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.11వేల కోట్ల పనులు చేపడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గోతులు తవ్వేశారు. గడచిన రెండేళ్లుగా వాటిని పూడ్చి రోడ్లు బాగు చేశాం. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతీ పౌరుడి ఆరోగ్య రికార్డులను డిజిటల్ గా పర్యవేక్షిస్తాం. ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించటం ద్వారా పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల మందికి ఉద్యోగాలు గడచిన రెండేళ్లలో వచ్చాయి. సంపద సృష్టించేలా క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ పెంచాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు పూర్తి చేస్తున్నాం.రాయలసీమ జీవనాడి హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. వంద రోజుల్లో రూ.3,500 కోట్లు ఖర్చు చేసి చిట్టచివరి ప్రాంతమైన కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తి చేసి మార్కాపురం వరకూ నీళ్లు తీసుకువచ్చాం. శ్రీశైలం మల్లన్న పాదాల నుంచి మార్కాపురం చెన్నకేశవ స్వామి చెంతకు కృష్ణమ్మ నీళ్లు తీసుకెళ్లాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి నీళ్లు తీసుకువెళ్లాం. ఎల్ నినో కారణంగా వర్షాలు పడక రాష్ట్రంలో కరవు వచ్చింది. డ్రామాలు ఆడటానికి గొడ్డలి పార్టీ బయల్దేరింది. వరుణ దేవుడి కృపవల్ల మనకు సరైన సమయంలో కాస్త వర్షాలు పడ్డాయి. కృష్ణానదిలో నీళ్లు రాకపోయినా గోదావరి నీళ్లు పట్టిసీమ ద్వారా డెల్టాకు తెచ్చాం. గతంలో కేవలం 13 నెలల్లోనే పట్టిసీమ పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లు తెచ్చాం. పోలవరం పూర్తి అయితే కృష్ణా, గోదావరి డెల్టాలకూ నీటి సమస్యే ఉండదు. పట్టిసీమ అనే నిర్ణయం ఇక్కడి రైతుల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చింది. గొడ్డలి పార్టీ విమర్శలకు భయపడితే కృష్ణాడెల్టాకు నీళ్లు వచ్చేవి కావు. ప్రతిపక్ష పార్టీ అంటే పోటీ తత్వం ఉండాలి. కాని గొడ్డలి పార్టీకి కుట్రతత్వం ఉంది.అభివృద్ధికి ఆటంకాలు కలిగించటమే గొడ్డలి పార్టీ పని" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.




**పర్యాటక ల్యాండ్ మార్క్‌గా సూర్యలంక**

"వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని కూడా మనం కాపాడుకోవాల్సి ఉంది. అన్ని ప్రాంతాల్లోనూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి. రాయలసీమ ప్రాంతాన్ని గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రూ.1 లక్ష కోట్లతో ప్రకాశం జిల్లాతో కలిపి 10 జిల్లాలను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తాం. ఉద్యాన పంటలతో పాటు లాజిస్టిక్స్ , పర్యాటకం ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడులు వస్తాయి.బాపట్లలోని సూర్యలంక బీచ్ దీనిని గోవా తరహాలో అభివృద్ధి చేస్తాం. పర్యాటకుల్ని ఆకర్షించేలా దీనిని తీర్చిదిద్దాలని ప్రణాళికలు చేస్తున్నాం. ఆ పర్యాటకుల్ని ఆకర్షించటం ద్వారా సూర్యలంక దేశ చిత్రపటంలో ఓ ల్యాండ్ మార్క్ గా మారాలి. వాన్ పిక్ ప్రాంతాన్ని గొడ్డలి పార్టీ అధినేత సర్వనాశనం చేశారు. అభివృద్ధే రాకుండా పోయింది. ఇష్టానుసారం అవినీతి చేసి సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నాడు. వాన్ పిక్ ద్వారా అద్భుతమైన పారిశ్రామిక టౌన్ షిప్ తయారు కావాల్సిన ప్రాంతాన్ని నాశనం చేశారు. ప్రజలకు జవాబుదారీ పరిపాలన ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాలు కల్పించి మెరుగైన పౌరసేవలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఐగాట్ మిషన్ కర్మయోగి కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ నైపుణ్యాలను పెంచుతోంది. మన ఉద్యోగులు 2.2 కోట్ల కోర్సులు చేసి దేశంలోనే ఏపిని అగ్రస్థానంలో నిలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు 4 వేల పైచిలుకు కోర్సులు చేసి నైపుణ్యాలు సాధించింది. ఇప్పుడు తన విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యను అందించేందుకు ఆ నైపుణ్యాలు ఆమెకు ఉపయోగపడుతున్నాయి. వ్యక్తిగతంగా మనం కూడా మనమన రోజువారీ కార్యక్రమాలను మరింత మెరుగ్గా నిర్వహించుకోవాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం కాకుండా నైపుణ్యాలు పెంచుకునే అంశంపై సమయం కేటాయించాలని కోరుతున్నాను." అని సీఎం సూచించారు.

**అభివృద్ధి లో రాజీలేదు**

గత పాలకులు పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు పెట్టారు. రీసర్వే 2.0 ద్వారా భూవివాదాలు పరిష్కరించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. శెట్టిపల్లి, కంగుమంది, అమలాపురం తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న భూసమస్యల్ని పరిష్కరించాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా రెవెన్యూ రికార్డులను భద్రంగా పెడుతున్నాం. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాం. మరో 5.5 లక్షల ఇళ్లను త్వరలోనే నిర్మించి ఇస్తాం. పౌర సేవల్ని ప్రజలకు దగ్గర చేసేలా వాట్సప్ గవర్నెన్సు ద్వారా సేవలు అందిస్తున్నాం. డీప్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక రోజులు, నెలలు పట్టాల్సిన పనులు ఇప్పుడు నిముషాల్లోనే పూర్తి అవుతోంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. రాష్ట్రంగా మనం అవకాశాలను అందిపుచ్చుకోవాలి. విశాఖకు డేటా సెంటర్లు తీసుకువస్తే గొడ్డలి పార్టీ నీటి సమస్య అంటూ అడ్డుపడుతోంది. అమరావతి అంటే ఎడారి అని, శ్మశానమని, మావిగన్ అంటున్నారు. అడ్డంకులకు ఆగిపోను, అభివృద్ధి విషయంలో రాజీ పడను. నాయకుడంటే ప్రజల రేపటి భవిష్యత్ గురించి ఆలోచన చేయాలి. అందుకే 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో పనిచేస్తున్నాను. సమాజంలో చిట్టచివరి వ్యక్తి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టాం. ఆదాయం, ఆరోగ్యం, ఆనందం అనే విధానంతో ముందుకు వెళ్తున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, నేతలు మోపిదేవి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

# జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ దూకుడు

**హైదరాబాద్, మహా :** దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను వసూళ్లు సానుకూల వృద్ధిని నమోదు చేయగా, తెలుగు రాష్ట్రాల్లోనూ పన్ను ఆదాయం పెరిగింది. ముఖ్యంగా తెలంగాణ జీఎస్టీ వసూళ్లలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. సెప్టెంబర్ నెలలో తెలంగాణ రాష్ట్రం రూ.5,327 కోట్ల దేశీయ జీఎస్టీ ఆదాయాన్ని సమీకరించింది. గతంతో పోలిస్తే ఇది 18 శాతం వృద్ధిగా నమోదైంది. పన్ను వసూళ్లలో తెలంగాణ వృద్ధి జాతీయ సగటు కంటే మెరుగ్గా ఉన్నట్లు తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రానికి లభించిన పరిష్కారానంతర రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.22,231 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలోనూ 18 శాతం వృద్ధి కనిపించింది. వ్యాపార కార్యకలాపాలు, సేవారంగం, వినియోగ వ్యయం, పన్ను అనుసరణ వంటి అంశాలు రాష్ట్ర జీఎస్టీ ఆదాయంపై ప్రభావం చూపుతాయి. పన్ను చెల్లింపుల ప్రక్రియలో సాంకేతికత వినియోగం పెరగడం, పన్ను ఎగవేతల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు కూడా ఆదాయ వృద్ధికి దోహదపడే అంశాలుగా ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లోనూ పెరిగిన పన్ను ఆదాయం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ సెప్టెంబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు వృద్ధిని నమోదు చేశాయి. సెప్టెంబర్‌లో రాష్ట్రానికి రూ.3,599 కోట్ల దేశీయ జీఎస్టీ ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 6 శాతం వృద్ధిగా నమోదైంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఆంధ్రప్రదేశ్‌కు లభించిన పరిష్కారానంతర రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.19,598 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో మొత్తం 18 శాతం వృద్ధి నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్ర ఆదాయంలో జీఎస్టీ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో నెలవారీ వసూళ్లలో నమోదవుతున్న మార్పులను ఆర్థిక శాఖలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. తెలంగాణతో పోలిస్తే సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ దేశీయ జీఎస్టీ వృద్ధి రేటు 6 శాతంగా ఉన్నప్పటికీ, ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిష్కారానంతర రాష్ట్ర జీఎస్టీ ఆదాయంలో 18 శాతం వృద్ధి నమోదవడం గమనార్హం. పన్ను వసూళ్ల పెరుగుదల రాష్ట్రాల స్వంత ఆదాయ వనరులను బలోపేతం చేయడంలో కీలకంగా మారుతోంది.

**ఆరు నెలల్లో తెలుగు రాష్ట్రాల ఆదాయానికి ఊతం**

ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల కాలాన్ని పరిశీలిస్తే తెలంగాణకు రూ.22,231 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,598 కోట్ల పరిష్కారానంతర రాష్ట్ర జీఎస్టీ ఆదాయం సమకూరింది. రెండు రాష్ట్రాల్లోనూ ఈ కాలంలో 18 శాతం వృద్ధి నమోదైంది. సెప్టెంబర్ నెలలో మాత్రం తెలంగాణ దేశీయ జీఎస్టీ వసూళ్లు రూ.5,327 కోట్లకు చేరుకోగా, ఆంధ్రప్రదేశ్ వసూళ్లు రూ.3,599 కోట్లుగా ఉన్నాయి. అంటే ఒక్క సెప్టెంబర్ నెలలోనే రెండు రాష్ట్రాల మధ్య రూ.1,728 కోట్ల వ్యత్యాసం నమోదైంది. జీఎస్టీ పరిష్కారాలు, పన్ను చెల్లింపులు, వ్యాపార లావాదేవీలు, రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాల స్థాయి వంటి అంశాలు తుది ఆదాయ గణాంకాలను ప్రభావితం చేస్తాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో పన్ను ఆదాయ వృద్ధి కొనసాగుతున్నప్పటికీ, నెలవారీ వసూళ్లను మాత్రమే ఆధారంగా చేసుకుని రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తుది నిర్ణయానికి రావడం కంటే వరుస నెలల గణాంకాలను పరిశీలించడం అవసరం. తాజా జీఎస్టీ గణాంకాలు మాత్రం రెండు రాష్ట్రాల ఆదాయానికి సానుకూల సంకేతాలను చూపిస్తున్నాయి.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికకు బ్రేక్

( మొదటి పేజీ తరువాయి )

వివరాలను పూర్తిగా వెల్లడించలేదని ఆమె తన పిటిషన్‌లో ఆరోపించారు. దానం నాగేందర్ ఎన్నిక చెల్లుబాటు కాదని ప్రకటించి, ఆ ఎన్నికను రద్దు చేయాలని ఆమె కోరారు. ఆ కేసులో తుది తీర్పు వెలువడకముందే ఖైరతాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకూడదని తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఉప ఎన్నిక ప్రక్రియను నిలిపివేయాలన్న అభ్యర్థనపై హైకోర్టు వెంటనే తుది నిర్ణయం తీసుకోకుండా విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. దీంతో పాత ఎన్నికల పిటిషన్ పరిస్థితి, దాని ఆధారంగా ఉప ఎన్నిక నిర్వహణకు ఉన్న న్యాయపరమైన అంశాలపై తదుపరి విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా పిటిషన్‌లో ఎన్నికల సంఘంతో పాటు దానం నాగేందర్‌ను కూడా ప్రతివాదులుగా పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.



**పెండింగ్ కేసు తేలే వరకు ఎన్నిక లేదన్న ఈసీ**

విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నందున ఖైరతాబాద్ నియోజకవర్గానికి ప్రస్తుతానికి ఉప ఎన్నిక నిర్వహించబోమని ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. అంటే నోటిఫికేషన్ జారీకి ముందే పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన వ్యవహారం పరిష్కారం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈసీ వైఖరితో ఉప ఎన్నిక ప్రక్రియపై ఉన్న తక్షణ అనిశ్చితికి కొంత స్పష్టత వచ్చినప్పటికీ, తుది నిర్ణయం హైకోర్టు విచారణ అనంతర పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. విజయారెడ్డి కోరుతున్నది పాత కేసుపై తుది తీర్పు వెలువడే వరకు ఉప ఎన్నిక ప్రక్రియను నిలిపివేయడమే. ఈ అంశంపై హైకోర్టు వచ్చే మంగళవారం విచారణ చేపట్టనున్న నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక తదుపరి అడుగు ఏ దిశగా సాగుతుందన్నది ఇప్పుడు న్యాయస్థానం నిర్ణయంపై ఆధారపడి ఉంది. తమిళనాడులో ఇలాగే పెండింగ్ ఉండడంతో ఐదు అసెంబ్లీస్థానాలకు గడువు ముగిసినా ఈసీ ఉప ఎన్నిక నిర్వహించలేదు. ఇపుడు అదే తరహాలో ఖైరతాబాద్ కు కూడా వాయిదా పడుతుందా.. గ్రీన్ సిగ్నల్ లభిస్తుందా ? అన్నది చూడాలి

# ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

( మొదటి పేజీ తరువాయి )

సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున కరవు మండలాలను ప్రకటించి తగిన సాయం అందించాలని కేంద్రాన్ని తెలంగాణ కేబినెట్ కోరింది. త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు ఢిల్లీకి మంత్రుల బృందం వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సుమారు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలను రాష్ట్ర మంత్రివర్గం మంజూరు చేసింది. తెలంగాణ డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీని మంత్రివర్గం ఆమోదించింది. వివిధ కేటగిరీల్లోని భూముల క్రమబద్ధీకరణ కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయించింది.

ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ

రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించారు. అఖిల పక్షంతో పాటు రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేసి ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరించాలని సీఎం తెలిపారు. కరువు మండలాలు ప్రకటించడంతో పాటు..రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి క్యాబినెట్ విజ్ఞప్తి చేసింది. ఎల్‌నినో పరిస్థితులతో గణనీయంగా పెరిగిన విద్యుత్తు వినియోగంపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు 15వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 19 వేల 892 మెగావాట్ల డిమాండ్ కు చేరింది.ఈ నేపథ్యంలో డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కడా కోతల్లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, అవసరమైన మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7 వేల 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది.



**కేబినెట్ మరికొన్ని కీలక నిర్ణయాలు ఇవే**

- ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.
- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునస్సమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.
- ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే వాటిని రద్దు చేయాలని నిర్ణయం
- 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు ప్రత్యేక పాలసీకి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.
- కోహెడలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు కోసం 650 కోట్ల రూపాయలు మంజూరు.

# వరంగల్ ట్రాఫిక్ లో గరం గరం

- ట్రాన్స్ఫర్ ప్రచారం పై సిబ్బందిపై గరమైన ట్రాఫిక్ సీఐ!

**వరంగల్, బ్యూరో మహా :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో స్థానచలనం జరుగుతుందనే ప్రచారంతో ట్రాఫిక్ సీఐ తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. ట్రాన్స్ఫర్ గురించి బుధవారం మధ్యాహ్నం మాట్లాడిన సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేసి, ఒక హోంగార్డు169 కు రిటర్న్ పాస్ పోర్ట్ ఇచ్చి ఏకంగా కమిషనరేట్ కు పంపించారని సమాచారం. వరంగల్ ట్రాఫిక్ విభాగంలో గత కొన్ని రోజులుగా ట్రాఫిక్ అధికారి పై అవినీతి ఆరోపణలతో స్థానచలనం తప్పదనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీని పై మహా పత్రికలో కూడా వరుస కథనాలు వచ్చాయి. ఈ ప్రచారం పై ప్రస్తుత ట్రాఫిక్ సీఐ తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. తన బదిలీ గురించి సిబ్బందే ప్రచారం చేస్తున్నారని భావించిన సీఐ, సిబ్బంది పై గరమైనట్లు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది మధ్య చర్చ జరుగుతోంది.ఇందులో భాగంగానే, ట్రాన్స్ఫర్ అంశాన్ని ప్రస్తావించిన ఒక చిరు ఉద్యోగిని విధుల నుంచి తప్పించి, కమిషనరేట్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారనే ఆరోపణ వినిపిస్తోంది. దీంతో ట్రాఫిక్ విభాగంలోని మిగతా సిబ్బందిలో కూడా భయాందోళన నెలకొందని తెలుస్తోంది. అంతేకాదు, గతంలో ట్రాఫిక్ సీఐ సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ట్రాఫిక్ నియంత్రణ పై దృష్టి పెట్టాల్సిన అధికారి, సొంత సిబ్బందిపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం, బదిలీ ప్రచారంతో ఉద్యోగులను కమిషనరేట్ కు పంపడం ఇప్పుడు పోలీస్ శాఖలో హాట్ టాపిక్ గా మారింది. ఈ వ్యవహారంపై వరంగల్ పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకుని విచారణ జరపాలని సిబ్బంది కోరుతున్నట్లు సమాచారం.

# ఎస్ఐఆర్ ప్రక్రియతో ప్రజాస్వామ్యం ధ్వంసం

**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఈ సర్ ప్రక్రియను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురూ కలిసి సర్ ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని, ఇది దేశద్రోహం కిందికే వస్తుందని ఆరోపించారు. ఇదే సమయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని, మోదీ షా ద్వయంపై దర్యాప్తు జరగాలని కూడా ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కర్ణాటక బెళగావిలో ఓటర్ల పేర్ల తొలగింపు కుట్రకు సంబంధించి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# పైలట్ స్మిత్ మచ్ఛర్‌కు గుజరాత్ ప్రభుత్వం ప్రత్యేక పురస్కారం..

**మహా :** దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానంలో జరిగిన ఘటనలో ధైర్యంగా వ్యవహరించి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్ఛర్‌కు గుజరాత్ ప్రభుత్వం రాష్ట్ర పురస్కారాన్ని ప్రకటించింది. ఆయనకు 'విశిష్ట గుజరాత్ గరిమా అవార్డు' అందించనున్నట్లు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తాజాగా ప్రకటించారు. కాక్‌పిట్ లో సహ పైలట్ తనపై దాడి చేసి కత్తితో పొడిచినప్పటికీ కెప్టెన్ స్మిత్ మచ్ఛర్ ధైర్యంగా వ్యవహరించి విమానాన్ని ప్రమాదం నుంచి కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని విమానాశ్రయానికి మళ్లించారు. ఈ విమానంలో 174 మంది ప్రయాణికులు ఉన్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ మచ్ఛర్ చూపిన ధైర్యం కారణంగా పెద్ద ప్రమాదం తప్పింది. ప్రస్తుతం కెప్టెన్ మచ్ఛర్ సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు కూడా నిర్వహించారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి మహా :** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం అంతర్గాం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనం, ఆకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియ, రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతర్గాం మండలంలో నిర్మిస్తున్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి ఆరు నెలల్లోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఆకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్.. సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు ముందస్తు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా సర్వే నంబర్లకు సంబంధించిన రైతులు సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా సమాచారం ఇవ్వాలని సూచించారు.భూ రీసర్వేను నవంబర్ 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సర్వేయర్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రీసర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారం 6 ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు.తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులు, సంబంధిత ప్రక్రియల పురోగతిని పరిశీలించిన ఆయన.. పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పర్యటనలో ఏడీ సర్వేయర్ సోమేశ్వర్, అంతర్గాం తహసీల్దార్ పడాల ప్రసాద్ రావు, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, అంతర్గాం మండల సర్వేయర్ లలితతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌పై విస్తృత ప్రచారం కల్పించాలి!



**పెద్దపల్లి మహా :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సేవా సేతు అభియాన్ సదస్సులను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని జండా చౌరస్తా సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో నిర్వహించిన పీఎం సూర్య ఘర్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించే సేవా సేతు అభియాన్ క్యాంపుల్లో విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకునేందుకు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**ఒకే వేదికపై సేవలు**

ఎన్పీడీసీఎల్, టీజీ రెడ్కో అధికారులు, బ్యాంకర్లు, సోలార్ వెండర్లు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో ప్రజలకు అవసరమైన సమాచారం, సేవలు ఒకేచోట లభిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యుత్ వినియోగదారుడు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

**ఇంటింటికీ వెళ్లి ప్రచారం**

ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు, ఉద్యోగులు అధికంగా నివసించే కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి పీఎం సూర్య ఘర్ పథకం, సోలార్ విద్యుత్ వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ గంగాధర్, డీఈ బాలయ్య, ఏడీఈ మల్లేశం, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, సోలార్ వెండర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శబ్ద కాలుష్యం పై ట్రాఫిక్ పోలీసుల ఉక్కు పాదం

**350 సైలెన్సర్ల ను రోడ్డు రోలర్ తో ధ్వంసం**

**వరంగల్, పోచమ్మ మైదాన్ మహా :** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర రావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది గురువారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సర్కిల్ వద్ద శబ్ద కాలుష్యాన్ని పెంచే వాహనాల యొక్క సైలెన్సర్ల ను ధ్వంసం చేసే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాహనాలకు కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి అమర్చిన, అధిక శబ్దాన్ని వెలువరించే సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తనిఖీల సందర్భంగా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా స్వాధీనం చేసుకున్న సుమారు 350 మార్పు చేసిన సైలెన్సర్లను రోడ్డు రోలర్ సహాయంతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు మాట్లాడుతూ, వాహనాల సైలెన్సర్లను మార్పు చేసి అధిక శబ్దం వచ్చే విధంగా వినియోగించడం వల్ల శబ్ద కాలుష్యం పెరగడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వాహనదారులు తమ వాహనాల్లో కంపెనీ అమర్చిన ఒరిజినల్ సైలెన్సర్లనే ఉపయోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్చి అధిక శబ్దం వచ్చేలా చేసే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రై సిటీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సుజాత, ప్రవీణ్, పిట్టల వెంకన్న, ఎస్సైలు, ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ

**పెద్దపల్లి మహా :** ఎస్ఐఆర్-2026 ప్రక్రియను ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లను నోటీసులు, పత్రాల సమర్పణ కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ స్పష్టం చేశారు. బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేసి, అవసరమైన పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ అవసరమైతే ఆన్‌లైన్‌లో నిర్వహించాలని తెలిపారు.కొత్త ఓటరు నమోదుకు ఫారం 6తో పాటు డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. ఫారం 6, 7, 8 దరఖాస్తుల పెండింగ్, పరిష్కార వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.

# 2027 వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

**అక్టోబర్ 10న భారత్-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్**




**మహా :** ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల క్రికెట్ వన్డే ప్రపంచకప్ 2027 షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) గురువారం విడుదల చేసింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ సరికొత్త ఫార్మాట్ తో అభిమానులను అలరించనుంది. 2023 ఫైనల్‌కు పునరావృతంగా, అక్టోబర్ 7న కేప్‌టౌన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. అయితే, గ్రూప్ స్టేజ్‌కు మాత్రం 12 జట్లే అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా అర్హత పొందాయి. వీటితో పాటు, 2026 సెప్టెంబర్ 30 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ 8లో నిలిచిన జట్లు కూడా నేరుగా క్వాలిఫై అవుతాయి. దీంతో మొత్తం 10 జట్లు ఖరారవుతాయి. మిగిలిన రెండు స్థానాల కోసం క్వాలిఫయర్ టోర్నమెంట్ నిర్వహిస్తారు. ఈ క్వాలిఫయర్‌లో గెలిచిన జట్టు నేరుగా గ్రూప్ స్టేజ్‌కు చేరుకుంటుంది. ఇక క్వాలిఫయర్‌లో 2, 3, 4 స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య 'సూపర్ సిరీస్' జరుగుతుంది. ఈ మూడు జట్ల మధ్య జరిగే రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల తర్వాత, అగ్రస్థానంలో నిలిచిన జట్టు గ్రూప్ స్టేజ్‌లో చివరిదైన 12వ జట్టుగా అర్హత సాధిస్తుంది. క్వాలిఫయర్స్‌లో ఓడిపోయిన మిగతా రెండు జట్లు టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి.

# బీఆర్ఎస్‌తో పొత్తే లేదు

( మొదటి పేజీ తరువాయి )



ఎవరు అన్నారు? పొత్తును ఎవరూ కోరుకోవడం లేదు" అని కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు. అనంతరం కేటీఆర్, ఆయన సోదరి కల్వకుంట్ల కవిత మధ్య కొనసాగుతున్న రాజకీయ విభేదాలను ప్రస్తావిస్తూ.. "మొదట కేటీఆర్ ఆయన చెల్లెలు కవితను కలవమనండి. తరువాత వేరే పొత్తులు కోరుకోవచ్చు" అని వ్యాఖ్యానించారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ-బీఆర్ఎస్ మధ్య పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి.

**బీజేపీతో పొత్తు ఉండదన్న కేటీఆర్**

బీజేపీతో పొత్తు అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఇటీవల స్పష్టమైన ప్రకటన చేశారు. సెప్టెంబర్ 30న జరిగిన కార్యక్రమంలో ఆయన బీఆర్ఎస్‌కు బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదని చెప్పారు. 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని గతంలోనూ కేటీఆర్ ప్రకటించారు. సెప్టెంబర్ 16న కూడా బీజేపీతో పొత్తు ఉండదని ఆయన స్పష్టం చేసినట్లు తెలంగాణ టుడే నివేదించింది. అంతకుముందు జూన్ 12న కూడా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వతంత్రంగా పోటీ చేస్తుందని కేటీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఒకవైపు బీఆర్ఎస్ నుంచి బీజేపీతో పొత్తు లేదన్న ప్రకటనలు, మరోవైపు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌తో పొత్తు లేదన్న ప్రకటనలు రావడం గమనార్హం.

**కవిత–కేటీఆర్ విభేదాల ప్రస్తావన**

కిషన్‌రెడ్డి చేసిన "మొదట కేటీఆర్ ఆయన చెల్లెలు కవితను కలవాలి" అన్న వ్యాఖ్యకు ప్రస్తుత తెలంగాణ రాజకీయ పరిణామాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. కేటీఆర్, కవిత మధ్య ఇటీవల బహిరంగంగా విభేదాలు వ్యక్తమయ్యాయి. సెప్టెంబర్ 29న కవిత కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేసినట్లు ఏబీపీ దేశం నివేదించింది. మరోవైపు ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ అభ్యర్థిని బరిలోకి దింపుతామని కవిత ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ అంతర్గత పరిణామాలను ప్రస్తావిస్తూ రాజకీయంగా స్పందించినట్లుగా ఉన్నాయి. అయితే పొత్తుల విషయంలో ప్రస్తుతానికి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటన, కేటీఆర్ గతంలో చేసిన ప్రకటన రెండూ ఒకే విషయాన్ని సూచిస్తున్నాయి—బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అధికారిక పొత్తు లేదని ఇరు పార్టీల నేతలు చెబుతున్నారు.

# నటి రన్యారావుకు భారీ షాక్

( మొదటి పేజీ తరువాయి )



తరుణ్‌తో పాటు మరో ముగ్గురు కలిసి విదేశాల నుంచి మొత్తం 113 కిలోల బంగారాన్ని అక్రమంగా భారత్‌కు తీసుకొచ్చినట్లు కస్టమ్స్ దర్యాప్తులో తేలిందని అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో రన్యారావు పాత్రపై దర్యాప్తు అధికారులు సేకరించిన వివరాల ఆధారంగా తాజాగా జరిమానా చర్యలు చేపట్టినట్లు సమాచారం. బంగారం అక్రమ రవాణా కేసులో ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన వివరాల్లో రూ.89 కోట్ల జరిమానా కీలక పరిణామంగా మారింది.

**విమానాశ్రయంలో 14 కిలోల బంగారం గుర్తింపు**

ఈ కేసు 2025 మార్చి 3న వెలుగులోకి వచ్చింది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రన్యారావును డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 14 కిలోల బంగారం గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం ఈ వ్యవహారంపై దర్యాప్తు ముమ్మరం చేశారు. విదేశాల నుంచి బంగారం తీసుకురావడానికి సంబంధించిన ప్రయాణ వివరాలు, ఇతర వ్యక్తులతో సంబంధాలు, సరఫరా వ్యవస్థపై అధికారులు విచారణ జరిపారు. కేసు దర్యాప్తులో రన్యారావుతో పాటు మరో నలుగురి ప్రమేయం ఉన్నట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మొత్తం 113 కిలోల బంగారం అక్రమంగా తరలించినట్లు దర్యాప్తు నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. అనంతరం ఈ కేసులో విదేశీ మారక ద్రవ్య చట్టాలు, అక్రమ రవాణా నిరోధక చట్టానికి సంబంధించిన నిబంధనల కింద కూడా చర్యలు చేపట్టినట్లు సమాచారం. కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రన్యారావు వ్యవహారం కర్ణాటకలో తీవ్ర చర్చకు దారితీసింది.

**ఫిబ్రవరిలో బెయిల్.. ఇప్పుడు భారీ జరిమానా**

ఈ కేసులో రన్యారావుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ఆమెకు బెయిల్ లభించగా, తాజాగా కస్టమ్స్ శాఖ రూ.89 కోట్ల జరిమానా విధించడం మరో కీలక పరిణామంగా మారింది. కస్టమ్స్ అధికారులు జారీ చేసిన నోటీసు, 399 పేజీల దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన ప్రక్రియ కొనసాగనుంది. ఈ పరిణామంపై కర్ణాటక హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. జరిమానాకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు ఇంకా తెలియవని, సమాచారం తెలుసుకున్న తర్వాత స్పందిస్తానని బెంగళూరులో మీడియాకు తెలిపారు. కాగా, కస్టమ్స్ శాఖ తాజా ఉత్తర్వుల నేపథ్యంలో జరిమానా విధింపునకు సంబంధించిన పూర్తి కారణాలు, దర్యాప్తు నివేదికలోని ఇతర అంశాలు, కేసులో మిగిలిన నిందితులపై తీసుకోబోయే చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కేసు తదుపరి దశలో న్యాయపరమైన పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# సింగరేణి క్వార్టర్ ఖాళీ వివాదం

**బీఆర్ఎస్ ఆరోపణలు, యాజమాన్యం, ఎస్సీ సెల్ కౌంటర్**

**మందమర్రి, మహా :** సింగరేణి క్వార్టర్ల ఖాళీ వ్యవహారం మంచిర్యాల జిల్లాలో రాజకీయ దుమారం రేపుతోంది. బీఆర్ఎస్ నేత క్వార్టర్ ను కక్షసాధింపుతో ఖాళీ చేయిస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తుంటే, అదంతా నిబంధనల ప్రకారమే జరిగిందని, మంత్రికి ఎలాంటి సంబంధం లేదని సింగరేణి యాజమాన్యం, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తిప్పికొట్టింది.

**బీఆర్ఎస్ ఆరోపణలు**

రాష్ట్రంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కార్మికులకు అండగా ఉండాల్సిన కార్మిక శాఖ మంత్రి కక్షపూరితంగా మద్ది శంకర్ క్వార్టర్ ను బలవంతంగా ఖాళీ చేపిస్తున్నారని ఆరోపించారు.

**విజిలెన్స్ నివేదిక ఆధారంగానే చర్యలు**

ఈ ఆరోపణలపై మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ వీడియో ప్రకటన విడుదల చేశారు. మందమర్రి ఏరియాలోని బీ40 క్వార్టర్‌ను బీఆర్ఎస్ నేత మద్ది శంకర్ అనధికారికంగా ఆక్రమించుకుని వినియోగిస్తున్నట్లు విజిలెన్స్‌కు ఫిర్యాదు అందిందని తెలిపారు. ఎస్టేట్, పర్సనల్ విభాగాల విచారణలో ఆ క్వార్టర్ ఆయనకు అధికారికంగా కేటాయించలేదని తేలిందన్నారు. ముందుగా కౌన్సెలింగ్ ఇచ్చి, ఆ తర్వాత ఫారంఏ, ఫారంబీ నోటీసులు జారీ చేసినా ఖాళీ చేయకపోవడంతో పోలీస్, సెక్యూరిటీ, ఎస్టేట్ విభాగాల సమక్షంలో సామగ్రిని సురక్షిత ప్రదేశానికి తరలించి క్వార్టర్‌ను స్వాధీనం చేసుకుని మరో ఉద్యోగికి కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఈ వ్యవహారానికి మంత్రి గడ్డం వివేకానందకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రాజకీయ కారణాలతో మంత్రిని వివాదంలోకి లాగడం సరికాదని హితవు పలికారు.

**కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఫైర్**

క్వార్టర్‌ను అక్రమంగా ఆక్రమించి మంత్రిపై నిందలు వేయడంపై మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పైడిపల్లి నర్సింగ్ మండిపడ్డారు. గతంలో చెన్నూరు ఎమ్మెల్యేగా, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద కుటుంబం మద్ది శంకర్‌ను ఎంతో ఆదుకుందని, అలాంటి కుటుంబంపైనే వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ఇలాంటి కుట్రపూరిత ప్రచారాలను కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ రాజా వారింగ్ రాజీనామా

మహా: పంజాబ్ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్ తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్‌కు రాజీనామా లేఖ అందించారు. కొత్త అధ్యక్షుడి పేరును 24 నుంచి 48 గంటల్లో ప్రకటించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలలే ఉన్న సమయంలో ఈ మార్పు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. మాజీ మంత్రి విజయ్ ఇందర్ సింగ్లా పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జలంధర్ కాంట్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్, గురుదాస్‌పూర్ ఎంపీ సుఖ్‌జిందర్ సింగ్ రంధావా పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ పేరు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. రాజా వారింగ్ రాజీనామాకు పంజాబ్ కాంగ్రెస్‌లో చాలాకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వారింగ్ వర్గానికి, చరణ్‌జిత్ సింగ్ చన్నీ వర్గానికి మధ్య విభేదాలు పార్టీ కార్యక్రమాలు, సమావేశాల్లోనూ బయటపడ్డాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ గతంలో వారింగ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగిస్తూ.. చన్నీకి పార్టీ ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించింది. అయినా విభేదాలు పూర్తిగా సమసిపోలేదు. ఇటీవల పంజాబ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన సచిన్ పైలట్ రాష్ట్ర నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. పార్టీ పరిస్థితి, అంతర్గత విభేదాలపై నివేదికను అధిష్ఠానానికి సమర్పించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ నివేదిక తర్వాతే రాష్ట్ర నాయకత్వంలో మార్పుపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాజా వారింగ్ 2022 ఏప్రిల్‌లో పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు.



# నారాయణపూర్‌పై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

**కరీంనగర్, మహా:** నారాయణపూర్ రిజర్వాయర్ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. గ్రామస్తులు అపోహలు, ఆందోళనలకు గురికావద్దని భరోసా ఇచ్చారు. రిజర్వాయర్ ప్రభావం, ముంపు పరిస్థితులు, భూసేకరణ, సాగు భూములు, ఇళ్లు, ప్రజా సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో షర్మిల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, తహసీల్దార్ రజిత తదితర అధికారులతో కలిసి గురువారం నారాయణపూర్ రిజర్వాయర్ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. సుమారు 350 కుటుంబాలపై రిజర్వాయర్ ప్రభావం, భూసేకరణ, సాగు భూములు, ఇళ్లు, హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిపై వివరాలు సేకరించారు. కార్యాలయ రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. నారాయణపూర్‌తో పాటు చర్లపల్లి, మంగపేట గ్రామాల్లోనూ రిజర్వాయర్ ప్రభావాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. సమస్యపై పది శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ముంపు ప్రభావం, భూసేకరణ, భూముల పరిస్థితి, ప్రజలకు కలిగే నష్టంపై అధ్యయనం చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా అందించాలని సూచించారు. ప్రతి అంశాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కారం చూపుతామని చెప్పారు. భూసేకరణ ప్రక్రియకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో గ్రామస్తుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లిన నేపథ్యంలో ఈ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ప్రజల సహకారంతో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు.

# ఎమ్మెల్యే కాలే యాదయ్య హామీ ఇచ్చి 50 రోజులు గడిచినా పరిష్కారం కాని 60 గజాల సమస్య

**98 రోజులుగా రిలే నిరాహార దీక్ష.. పట్టాలు ఉన్నా పొజిషన్ ఇవ్వలేదని బాధితుల ఆవేదన**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151లో 60 గజాల ఇంటి స్థలాల కోసం బాధితులు గత 98 రోజులుగా శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. నాలుగు యువజన సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన కొనసాగుతోంది. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన 290 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేసిందని బాధితులు తెలిపారు. పట్టాలు అందిన అనంతరం ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు పునాదులు తీయడం ప్రారంభించారని పేర్కొన్నారు. అయితే వెనుక వైపు ఉన్న భూమికి సంబంధించిన వ్యక్తి రహదారి కోసం కోర్టును ఆశ్రయించడంతో అప్పటి నుంచి తమకు కేటాయించిన స్థలాలపై భౌతిక స్వాధీనం (పొజిషన్) ఇవ్వలేదని వారు తెలిపారు. తమకు మంజూరైన ఇంటి స్థలాలను అప్పగించే వరకు పోరాటాన్ని విరమించేది లేదని బాధితులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే హామీపై ఎదురుచూపులు దీక్షా శిబిరాన్ని చేవెళ్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కాలే యాదయ్య సందర్శించి బాధితులకు సంఘీభావం తెలిపారు. 60 గజాల ఇంటి స్థలాల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టి బాధితులకు స్థలాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని బాధితులు పేర్కొన్నారు. అయితే ఎమ్మెల్యే హామీ ఇచ్చి సుమారు 50 రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి సంబంధించి ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 98 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా తమ సమస్యపై ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం బాధాకరమని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి 290 మంది పేదలకు మంజూరైన 60 గజాల చొప్పున ఇంటి స్థలాలను అందించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేసి పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమీద శ్రీను, శాంతి యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యూత్ అధ్యక్షుడు కరీమ్, సేవాలాల్ యూత్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, శాబాద్ ప్రవీణ్, రెడ్డిపల్లి సుమన్, శాబాద్ నాగరాజు, దార్గుపల్లి రాజేందర్, బైండ్ల యాదయ్య, హిమాయత్‌నగర్ మహిళలు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్
02-10-2026
మహా ప్రత్యేకం




# స్మిత్ మచ్చర్.. ఇండియన్ హీరో

## పైలట్ మచ్చర్ సాహసానికి దేశం జేజేలు .. 180 మందిని కాపాడిన భారతీయ పైలట్



(మహా ప్రత్యేకం)
ఫ్లై దుబాయ్ విమానంలో కోపైలట్ జరిపిన ప్రాణాంతక దాడిని ధైర్యంగా తిప్పికొట్టి వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత సంతతి పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్ పై ప్రశంసల జల్లు కురుస్తోంది. దేశమంతా జేజేలు పలుకుతోంది. ఆకాశంలో వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానంలో ఊహించని భయాందోళన.. తోటి కోపైలటే విమానాన్ని కూల్చివేసేందుకు కత్తితో దాడికి తెగబడ్డాడు.. తీవ్రంగా గాయపడి, శరీరం నుంచి రక్తం కారుతున్నా సరే.. అత్యంత సమయస్ఫూర్తితో వ్యవహరించి 180 మంది ప్రాణాలను కాపాడారు భారతీయ పైలట్ముం. బైకి చెందిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ చూపిన అసమాన ధైర్యం, తెగువ వల్ల ప్రపంచం మరో 9/11 తరహా విషాదం నుంచి తప్పించుకుంది. తన సమయస్ఫూర్తితో విమానంలోని 180 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారని ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లైదుబాయ్ దుబాయ్‌టెల్ అవీవ్ విమానంలో కాక్‌పిట్ లోపల జరిగిన ఈ అనూహ్య పరిణామంలో, ఒమన్‌కు చెందిన కోపైలట్ విమానాన్ని కూల్చివేయడానికి యత్నించగా, భారత సంతతికి చెందిన పైలట్ఇన్‌కమాండ్ స్మిత్ మచ్చర్ సమయస్ఫూర్తితో ఘోర ప్రమాదాన్ని తప్పించాడు.

### ఆకాశంలో భయానక క్షణాలు

విమానం గాల్లో ఉన్న సమయంలో  పైలట్లలో ఒకరు మరో పైలట్‌పై దాడి చేసి విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించారు. ఈ సమయంలో కాక్‌పిట్‌లో రక్తం కనిపించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కేవలం 30 సెకన్ల వ్యవధిలో విమానం 33,000 అడుగుల నుంచి 17,000 అడుగులకు, దాదాపు 14,000 అడుగుల మేర ఒక్కసారిగా కిందకు పడిపోయింది. ఈ పరిణామంతో ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

**ప్రాణాలను కాపాడిన స్మిత్ మచ్చర్**

ఈ ప్రమాదకర పరిస్థితిలో భారత సంతతి పైలట్ స్మిత్ మచ్చర్ సమయస్ఫూర్తితో కాక్ పిట్ డోర్ ఓపెన్ చేశారు. దీంతో తోటి ప్రయాణికులు, విధుల్లో లేని మరో ఇద్దరు పైలట్ల సహాయంతో, దాడికి పాల్పడిన వ్యక్తిని తీవ్రంగా శ్రమించి అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణీకులందరూ సురక్షితంగా బయటపడేలా చేసి, సౌదీ అరేబియాలోని తబూక్‌లో విమానాన్ని సురక్షితంగా అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో విమానం చివరి భాగం స్వల్పంగా దెబ్బతింది.



**ఉగ్రవాద కోణంలో దర్యాప్తు**

గగనతలంలో జరిగిన ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇజ్రాయెల్ అధికారులు దీన్ని ఒక ఉగ్రవాద చర్యగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సాహసోపేతమైన చర్యతో వందలాది మంది ప్రాణాలను కాపాడిన స్మిత్ మచ్చర్ ప్రస్తుతం అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంటున్నారు.  ప్రధాని మోదీ, ఇజ్రాయెల్ పీఎం నెతన్యాహు, యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ మచ్చర్ ను ప్రసంశించారు.

**స్మిత్ మచ్చర్ ఎవరు?**

స్మిత్ మచ్చర్ లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం, ఆయన జూన్ 2022 నుంచి ఫ్లైదుబాయ్ బోయింగ్ 737 విమానాల్లో కెప్టెన్‌గా పనిచేస్తున్నారు. 737800, 737 మాక్స్ 8.. 9లో  9,750 గంటల పాటు విమానం నడిపిన అనుభవం ఉంది. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు, ఆయన ముంబైలోని స్పైస్‌జెట్‌లో 11 సంవత్సరాలు పనిచేశారు. ఆయన సీనియర్ కమాండర్‌గా కూడా పనిచేశారు, ఆ తర్వాత నవంబర్ 2020లో లైన్ ట్రైనింగ్ కెప్టెన్ అయ్యారు. ఈ హోదాలో ఆయన ఇతర పైలట్‌లకు శిక్షణ ఇచ్చారు. మచ్చర్ ముంబైలోని ఘట్‌కోపర్ ఈస్ట్‌కు చెందినవాడని, ఉద్యోగ కోసం దుబాయ్‌లో నివసిస్తున్నారని తెలుస్తోంది. అతను ఫ్లైదుబాయ్‌లో డైరెక్ట్‌ఎంట్రీ కెప్టెన్‌గా చేరినట్లు కూడా ఆ ప్రొఫైల్ చూపిస్తుంది. దీని వల్ల, ఇప్పటికే మరో విమానయాన సంస్థలో కెప్టెన్ పదవుల్లో ఉన్న పైలట్లను నియమించుకుని, వారిని నేరుగా కెప్టెన్‌లుగా నియమించే అవకాశం విమానయాన సంస్థలకు ఉంటుంది. స్పైస్‌జెట్‌లో పైలట్‌ఇన్‌కమాండ్‌గా అతనికి 6,400 గంటలకు పైగా అనుభవం ఉందని కూడా అందులో పేర్కొన్నారు. మచ్చర్ జూన్ 2007 నుంచి ఏప్రిల్ 2008 మధ్య వెలింకార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుండి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేశారు. మచ్చర్ సోదరుడు కూడా అకాసా ఎయిర్‌లో పైలట్‌గా ఉన్నారని తెలుస్తోంది.

**టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ నుంచి ఏవియేషన్ రంగానికి..**

ముంబైలోని ఘాట్‌కోపర్ ఈస్ట్ ప్రాంతానికి



చెందిన స్మిత్ మచ్చార్ జీవిత ప్రయాణం ఎంతో ఆసక్తికరమైనది. చిన్నప్పుడు కుటుంబానికి చెందిన టెక్స్‌టైల్ వ్యాపారంలోకే వెళ్లాలని భావించారు. స్కూల్ విద్య పూర్తయ్యాక టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదువుతుండగా ఒక ఏవియేషన్ సెమినార్‌కు హాజరయ్యారు. అక్కడే ఆయనకు పైలట్  కావాలనే ఆసక్తి కలిగింది. 20072008 సమయంలో వెలింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి డిగ్రీ పూర్తి చేశారు. తన 19 ఏళ్ల వయసులో పైలట్ కావాలని నిర్ణయించుకున్నప్పుడు కుటుంబంలో భిన్నమైన స్పందన వచ్చింది. గతంలో జలక్ మెహతా అనే పాడ్‌కాస్టర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్మిత్ ఈ విషయాలను గుర్తుచేసుకున్నారు. "మా అమ్మ చాలా భయపడింది. 1517 ఏళ్ల క్రితం ఏవియేషన్ రంగం ఇప్పుడు ఉన్నంత విస్తృతంగా లేదు. పైలట్లు అయ్యేవారు చాలా తక్కువ మంది ఉండేవారు. విమానాలు నడపడం అనే విషయాన్నే అమ్మ భయంగా భావించేది. కానీ నాన్న చాలా ప్రశాంతంగా నా నిర్ణయాన్ని సమర్థించారు," అని స్మిత్ చెప్పారు.

**సౌదీలో చికిత్స.. ప్రభుత్వం అండ**

కత్తిపోట్ల దాడిలో తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్చార్ ప్రస్తుతం సౌదీ అరేబియాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ముంబై ఘాట్‌కోపర్ ఈస్ట్ ఎమ్మెల్యే పరాగ్ షా స్మిత్ కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆయన క్షేమంగా ఉన్నారని ధృవీకరించారు. మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆయన చికిత్స వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నాయి. స్మిత్ తల్లిదండ్రులు ఇప్పటికే దుబాయ్ చేరుకున్నారు.

**ప్రపంచ నాయకుల ప్రశంసల వర్షం**

స్మిత్ మచ్చార్ వీరత్వానికి ప్రపంచ దేశాల అధినేతలు దాసోహమైపోయారు. ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "కెప్టెన్ స్మిత్ మచ్చార్ ఒక రియల్ హీరో! అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో, తీవ్రంగా గాయపడినప్పటికీ ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన అసాధారణ ధైర్యాన్ని, సడలని నిబద్ధతను ప్రదర్శించారు. ఆయన సాహసమే వందలాది ప్రాణాలను కాపాడి పెద్ద విషాదాన్ని తప్పించింది," అని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా ప్రశంసించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెన్జమిన్ నెతన్యాహు కూడా స్మిత్ ధీరత్వాన్ని కొనియాడారు. "తీవ్రంగా గాయపడినప్పటికీ ఆయన ఎదురుతిరిగి పోరాడారు. కాక్‌పిట్ తలుపులు తెరిచి ప్రయాణికులు, సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకునేలా చేశారు. ఇజ్రాయెల్ పౌరులతో పాటు 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన స్మిత్ నిజమైన కథానాయకుడు," అని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, "ఆ కోపైలట్ బహుశా ఉగ్రవాది అయి ఉండవచ్చు లేదా మానసిక స్థితి సరిగా లేనివాడై ఉండవచ్చు. తీవ్ర గాయాలతో ఉన్నప్పటికీ స్మిత్ సమయస్ఫూర్తితో వ్యవహరించి సహాయం కోసం కేకలు వేశారు. ఆయన నిజంగా గొప్ప వీరుడు," అని వ్యాఖ్యానించారు.









# మందమర్రి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన రామగుండం సీపీ

**మందమర్రి, మహా** : మందమర్రి పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా బుధవారం తనిఖీ చేశారు. మందమర్రి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న సీపీకి మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, మందమర్రి ఎస్ఐ నరేష్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కేంద్రం, రికార్డులు, సిబ్బంది బ్యారక్ ను పరిశీలించిన సీపీ, స్టేషన్ ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్ లైన్ వివరాల నమోదు, రికార్డుల అప్ లోడ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, నేర నియంత్రణ చర్యలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ పై ఎస్ఐ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మందమర్రి సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇక్కడ ప్రత్యేక సవాళ్లు ఉన్నాయన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో దొంగతనాలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైతే గ్యాంగ్ ఫైళ్లు తెరిచి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మందమర్రిని నేర రహిత, మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

# భూ రీసర్వేకు రైతులు సహకరించాలి

- **వేగవంతంగా పూర్తి చేసేందుకు ముందుకు రావాలి: తహశీల్దార్ రాముడు**

**పెద్దపల్లి మహా, కాల్వ శ్రీరాంపూర్**: భూ రీసర్వేను వేగవంతంగా పూర్తి చేసేందుకు రైతులందరూ అధికారులకు సహకరించాలని కాల్వ శ్రీరాంపూర్ తహశీల్దార్ రాముడు కోరారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మంగపేట గ్రామంలో సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో భూ రీసర్వేపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ రాముడు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు భూ రీసర్వే ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా కునారం, మంగపేట, వెన్నంపల్లి, కిస్టంపేట, మొట్లపల్లి గ్రామాలను భూ రీసర్వే కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే రీసర్వే పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. మంగపేట గ్రామంలో జూలై 14న తొలిసారిగా గ్రామసభ నిర్వహించి రీసర్వే పనులు ప్రారంభించామని, ఇప్పటివరకు 80 రోజుల్లో గ్రామంలోని మొత్తం 1,300 ఎకరాలకు గాను 600 ఎకరాల భూమికి మాత్రమే రీసర్వే పూర్తయిందని తెలిపారు. రైతులు రీసర్వే కోసం ముందుకు రావడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ భూములకు రీసర్వే చేయించుకోవాలని, తద్వారా గ్రామంలో నెలకొన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహశీల్దార్ సూచించారు. మంగపేటలో రీసర్వే పనులు మందగించడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరోసారి ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు ఎంత త్వరగా సహకరిస్తే అంత వేగంగా మిగిలిన భూములను కూడా కొలిచి రికార్డులను సరిచేస్తామని చెప్పారు. భూ రీసర్వే పూర్తయితే భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన హక్కులు లభిస్తాయని తహశీల్దార్ రాముడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, జీపీఓ రాజు, సర్వేయర్ రాజు, గ్రామ కార్యదర్శి రమ్య, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రెవెన్యూ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# రోడ్డు పనులు చేపట్టాలని రహదారి దిగ్బంధనం

**కుషాయిగూడ, మహా** : చర్లపల్లి డివిజన్ పరిధిలోని పుక్కడ్‌నగర్‌లో డ్రైనేజీ పనుల కోసం నాలుగైదేళ్ల క్రితం తవ్విన రోడ్డును తిరిగి నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ పుక్కడ్‌నగర్, ఆఫీసర్స్ కాలనీ, పెద్ద చర్లపల్లి ప్రాంతాల ప్రజలు రహదారి దిగ్బంధనం చేసి ధర్నా నిర్వహించారు. అనంతరం కాప్రా సర్కిల్ డీసీని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన డీసీ సంబంధిత డీఈకి రోడ్డు పనులపై ఆదేశాలు ఇచ్చారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. కార్యక్రమానికి భాజపా చర్లపల్లి డివిజన్ నాయకులు, రైల్వే బోర్డు సభ్యులు కొమ్ము నర్సింగ్‌రావు, డి.నాదం, వి.రాంబాబు, శంకర్ వంశరాజ్, కొక్కొండ రాజు, రాజేష్ వంశరాజ్, సేలం వినోద్ ముదిరాజ్, మహమ్మద్ అక్బర్, ఏ.చారి, మధు, రాజేష్ తదితరులు మద్దతు తెలిపారు.



# కిష్టారంలో 'అమ్మ' మెడికల్ షాప్ ప్రారంభం

- **తక్కువ ధరలకు మందులు.. గ్రామస్థులకు అందుబాటులో వైద్య సేవలు**

**సత్తుపల్లి, అక్టోబరు 1**: మహా : గ్రామీణ ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కిష్టారం గ్రామంలో ఏర్పాటు చేసిన 'అమ్మ మెడికల్ షాప్' గురువారం ప్రారంభమైంది. మెడికల్ షాప్ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు, కాంగ్రెస్ నాయకుడు నరుకుళ్ళ అప్పారావు ముఖ్య అతిథులుగా హాజరై మెడికల్ షాప్ ను ప్రారంభించారు. వైద్యరంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న కువ్వారపు సతీష్, భవాని దంపతులు ఈ మెడికల్ షాప్‌ను ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు అవసరమైన మందులు స్థానికంగానే లభించేలా, తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందించడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామంలోనే మందులు అందుబాటులోకి రావడంతో ప్రజలకు సమీపంలోనే వైద్య అవసరాలు తీర్చుకునే అవకాశం కలుగుతుందని కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ప్రారంభించిన మెడికల్ షాప్‌కు గ్రామస్థులు ఆదరణ అందించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కువ్వారపు రాజా, గోపమ్మ గ్రామ పెద్దలు నరుకుళ్ళ రవి, నరుకుళ్ళ వెంకటేశ్వరరావు (ఎన్టీఆర్), కోనపురి చిరంజీవి, గ్రామ గ్రామస్థులు పాల్గొని సతీష్, భవాని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యత : కలెక్టర్

- **ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు**
- **హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్**
- **సత్కరించి దీవెనలు అందుకున్న అనూష**



**ఆదిలాబాద్ మహా**: వయోవృద్ధుల సంక్షేమం, భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా వృద్ధాశ్రమం, ప్రణాం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వారికి మెడికల్ హెల్ప్ క్యాంపులు, కంటి పరీక్షలు, ప్రభుత్వ పరంగా అందవలసిన పుస్తకాలు, సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు లేదా ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే తమ తల్లిదండ్రులను, వయోవృద్ధులను సరిగా చూసుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. బాధ్యత విస్మరించి వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే, వారి జీతం నుంచి ఆటోమేటిక్‌గా కోత విధించి నేరుగా వృద్ధులకు అందించేలా చట్టపరమైన నిర్ణయం తీసుకున్నామని, ఇది ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందని తెలిపారు. అదేవిధంగా, గతంలో భావోద్వేగంతో పిల్లలకు రాసిచ్చిన భూములను.. ఆ తర్వాత వారు సరిగ్గా చూసుకోకపోతే తిరిగి వెనక్కి పొందేలా చట్టంలో వెసులుబాటు ఉందని అన్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే వయోవృద్ధులు నేరుగా తనకు దరఖాస్తు చేసుకోవచ్చని, వెంటనే స్పందించి న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. జపాన్ తరహాలో రాబోయే రోజుల్లో మన దేశంలోనూ వయోవృద్ధుల సంఖ్య పెరుగుతుందని, ఆ సమాజానికి తగినట్లుగా వారి ఆరోగ్యం, డే కేర్ కార్యకలాపాలు, రక్షణ బాధ్యతలను ప్రతి ఒక్కరూ విస్మరించకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వయోవృద్ధులను సత్కరించి మెమెంటోలు అందచేసారు.

**సదా అనుసరణీయం**

మున్సిపల్ ఛైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ .. పెద్దల ఆలోచనలు, జీవిత అనుభవాలను గౌరవించడం ద్వారానే జీవితంలో, సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. వయోవృద్ధులను ఎప్పుడూ తక్కువగా భావించకూడదని, వారు మన కుటుంబానికి పెద్దలుగా, సమాజానికి అనుభవజ్ఞులుగా ఎంతో విలువైన వారని అన్నారు. వారు చెప్పే ప్రతి మాటలో జీవిత అనుభవం ఉంటుందని, వారి సూచనలు మన మంచి కోసమేనని తెలిపారు. వయోవృద్ధుల సలహాలు, సూచనలను గౌరవిస్తూ వారి ఆశీర్వాదాలు తీసుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. తాను మీ అందరికి మనవరాలినని అంటూ వృద్ధులను సన్మానించి వారి ఆశీస్సులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, వయోవృద్ధుల సమైక్య ప్రతినిధులు దేవిదాస్ దేశ్పాండే, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వయోవృద్ధులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## చెత్త ఆటోలో పేలుడు

**కుషాయిగూడ, మహా** : కుషాయిగూడ హనుమాన్‌నగర్ కాలనీలోని స్పార్కిల్ రబ్బర్ కంపెనీ సమీపంలో గురువారం ఉదయం చెత్త ఆటోలో పేలుడు సంభవించింది. ఆటోలో పరిశ్రమలకు సంబంధించిన స్క్రాప్‌తో పాటు గుర్తుతెలియని పేలుడు పదార్థాలు ఉండటమే ఘటనకు కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పేలుడు సమయంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆటో స్వల్పంగా దెబ్బతింది. సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# నాగర్ కర్నూలు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా** : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో హేమంత్ కేశవ్ పాటిల్ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఉన్న పరిచయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జెన్‌శేఖర్, ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్‌రావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డయాగ్నస్టిక్ సెంటర్‌లో బంగారు నగలు మాయం

కుషాయిగూడ, మహా : ఏఎస్ రావునగర్‌లోని ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌లో రక్త పరీక్షలు చేయించుకునేందుకు వెళ్లిన మహిళ బంగారు నగలు మాయమైన ఘటన చోటుచేసుకుంది. సుమారు 40 గ్రాముల బంగారు నగలు కనిపించకపోవడంతో ఇంటికి వెళ్లిన అనంతరం ఆమె గుర్తించింది. దీంతో కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనపై వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

# హక్కుల సాధనకు ఐక్య పోరాటమే శరణ్యం

**కుషాయిగూడ, మహా** : ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం పిలుపునిచ్చింది. నగర శివారు ప్రాంతంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న బోడుప్పల్‌లో మౌలిక వసతుల సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. కాలనీల్లో రహదారులు గుంతలమయంగా మారడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, చెత్త సేకరణలో లోపాలు, ట్రాఫిక్ సమస్యలు, ఆక్రమణలు, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాలు వెలగకపోవడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలు తమ కాలనీల్లోని సమస్యలను ఫోరం దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యలను సమగ్రంగా సేకరించి సంబంధిత అధికారులు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మాజీ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు చట్టబద్ధంగా నిరంతరం పోరాటం చేస్తామని, అవసరమైతే శాంతియుత ఆందోళనలు, ధర్నాలు చేపడతామని స్పష్టం చేశారు. కాలనీల సంక్షేమ సంఘాలు, పెద్దలు, యువత ముందుకు వచ్చి సమస్యల పరిష్కారానికి భాగస్వాములు కావాలని బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం కోరింది.

## కారేపల్లి గురుకుల పాఠశాలలో జోనల్ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీ

**కారేపల్లి, మహా**: కారేపల్లి లోని శ్రీకవిత ఇంజనీరింగ్ కళాశాల భవన్ లో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను భద్రాద్రి జోన్ జోనల్ అధికారి పి. అపర్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన ఆమె విద్య, వసతి, భోజనం, ఆరోగ్యం, మౌలిక సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నట్లు విద్యార్థినులు తెలిపారు. అనంతరం SA1 పరీక్షల నిర్వహణను పరిశీలించిన జోనల్ ఆఫీసర్ పరీక్షలు సక్రమంగా జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్, కిచెన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. క్యాంపస్ పరిసరాల్లో పెరిగిన గడ్డిని తొలగించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కల్పించాలని జోనల్ ఆఫీసర్ స్పష్టం చేశారు.

# విజ్ఞాన, సాంకేతిక రంగాలలో పరిశోధన సామాజిక అవసరాలను తీర్చడంపై దృష్టి పెట్టాలి

- **చైతన్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జి శంకర్ లింగం**




**మొయినాబాద్ మహా**: మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్‌నగర్‌లోని చైతన్య (డీమ్డ్ టు బి) యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన లలిత కుమారి తడవర్తికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్.డి ) డిగ్రీని విశ్వవిద్యాలయం ప్రదానం చేసింది. కంట్రోల్ వెబ్ ట్రాఫిక్ యూసింగ్ వెబ్ అప్లికేషన్ ఫైర్వాల్ అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనా థీసిస్‌కు గాను ఈ డిగ్రీని అందుకున్నారు. ఈ పరిశోధనను ఏ. రమేష్ బాబు పర్యవేక్షణలో ఆమె పూర్తి చేశారు .ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జి. శంకర్ లింగం లలిత కుమారి తడవర్తికి పీహెచ్‌డీ డిగ్రీని అధికారికంగా ప్రధానం చేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కంప్యూటర్ సైన్స్ విభాగంలో జరిగే పరిశోధన చేయడం అభినందనీయమని, వెబ్ అప్లికేషన్ ఫైర్‌వాల్ ఉపయోగించి వెబ్ ట్రాఫిక్‌ను నియంత్రించడంపై పరిశోధన చేయడం మంచి పరిణామం అని, ఇటువంటి పరిశోధనలు కంప్యూటర్ సైన్స్‌లో నూతన ఆలోచనలకు దోహదపడతాయని ఆయన తెలిపారు. అనంతరం రిజిస్ట్రార్ ఎం. రవీందర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో శాస్త్రీయ పరిశోధనలకు కీలకమైన పాత్ర ఉందని ఆయన పేర్కొన్నారు. సమాజ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, వినూత్నమైన పరిశోధనలను ప్రోత్సహించడంలో చైతన్య విశ్వవిద్యాలయం నిరంతరం ముందుంటుందని తెలిపారు. పరిశోధకులు తమ అధ్యయనాల ద్వారా సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు & ఛాన్సలర్ డాక్టర్ సిహెచ్.వి. పురుషోత్తం రెడ్డి మరియు డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి విద్యార్థిని విజయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ (రిసెర్చ్ & డెవలప్‌మెంట్) క్రిస్టఫర్, డీన్ (అడ్మినిస్ట్రేషన్) ఎ. రాజు, డీన్ (ఫ్యాకల్టీ అఫ్ సైన్స్ ) ఎస్ . కవిత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ కంట్రోలర్ ఈ. జగదీశ్ కుమార్, హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ (కంప్యూటర్ సైన్స్ ) ఏ.రమేష్ బాబు, కె. సతీష్, మరియు అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ!?

పెద్దపల్లి మహా : కాల్వ శ్రీరాంపూర్: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో గంగయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పరిశీలించి, ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ధ్రువపత్రాల జారీ, భూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. కార్యాలయానికి వచ్చే ప్రజలకు సేవలు సకాలంలో అందించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. తనిఖీ సందర్భంగా తహసీల్దార్ రాపెల్లి రాముడు,పాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన దాసరి ఉష

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి పట్టణంలోని 14వ వార్డు గర్భీ స్ట్రీట్‌కు చెందిన ఎండీ. మాజీద్ అలీ (ఎండీ. మునీర్ అలీ కుమారుడు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే విధంగా పెద్దపల్లి టౌన్ ఎంఐఎం పార్టీ మాజీ టౌన్ ప్రెసిడెంట్ ఎండీ. ఇమ్రాన్ తండ్రి ఎండీ. మునవార్ అలీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను కూడా దాసరి ఉష పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి అబ్దుల్ మాలిక్, ఎండీ. ఆదిల్, ఎండీ. ముఖీద్, ఎండీ. ముజీబ్, ఎండీ. తాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంపుల నిర్వహణ

కుషాయిగూడ, మహా :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు అక్టోబర్ నెలలో మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రి వేదికగా సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎమ్. సాంబశివరావు తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు వివిధ తేదీల్లో మొత్తం 1080 ఖాళీలకు (స్లాట్లకు) ఈ సదరం క్యాంపులు కొనసాగుతాయని వెల్లడించారు.వివిధ వైకల్యాలు ఉన్న దివ్యాంగుల కోసం నిర్దేశిత తేదీలలో ఈ క్యాంపులను ఏర్పాటు చేశారు. శ్రవణ లోపం (హియరింగ్ ఇంపైర్మెంట్) మరియు దృష్టిలోపం (విజువల్ ఇంపైర్మెంట్) ఉన్న వారికి అక్టోబర్ 1, 8, 15, 22, 29 తేదీలలో, ఆర్థోపెడిక్ లోపం (అంగ వైకల్యం) ఉన్న వారికి అక్టోబర్ 8, 15, 22, 29 తేదీలలో సదరం సేవలు అందుతాయి. అలాగే శ్రవణ లోపం ఉన్న వారికి అక్టోబర్ 2, 6, 13, 27 తేదీలలో మరియు మానసిక వికలాంగులకు (మానసిక మందగమనం, మానసిక అనారోగ్యం) అక్టోబర్ 17, 24, 31 తేదీలలో క్యాంపులు నిర్వహించనున్నారు.ఈ క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు మీసేవ కేంద్రం ద్వారా ముందస్తుగా నమోదు చేసుకున్న సదరం రశీదుతో పాటు ఆధార్ కార్డు నకలు, ఛాయాచిత్రం మరియు సంబంధిత వైద్య నివేదికలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. శారీరక లోపం ఉన్నవారు గాంధీ లేదా ఉస్మానియా ఆసుపత్రి నివేదికలు, మానసిక లోపం ఉన్నవారు నిమ్స్ లేదా ఎర్రగడ్డ ఆసుపత్రి నివేదికలు, శ్రవణ లోపం ఉన్నవారు కోటి ప్రభుత్వ ఆసుపత్రి నివేదికలు, మరియు దృష్టిలోపం ఉన్నవారు సరోజినీదేవి కంటి ఆసుపత్రి నివేదికలతో ఉదయం 9:00 గంటలకు క్యాంపునకు హాజరుకావాలని కోరారు. మీసేవ కేంద్రాలలో సదరం ఖాళీలు అందుబాటులో ఉన్నాయని అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

**వలిగొండ , మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని సుంకిశాల గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు గ్రామానికి చెందిన చెరుకు ముత్తయ్య 44000 54000 నల్ల రంగయ్య 22000 రాగిరు ముత్యాలు 22000 గ్రామ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు గ్రామ శాఖ అధ్యక్షులు పోలేపల్లి వీరస్వామి తుమ్మల సత్యనారాయణ రెడ్డి మాజీ సర్పంచ్ మొగిలిపాక నరసింహ పోలేపల్లి స్వామి పోలేపల్లి బాలకృష్ణ ఇంజమూరి రమేష్ పోలేపల్లి బాల నరసింహ పోలేపల్లి అశోక్ ఎస్.కె చాంద్బాషా వేముల మల్లయ్య దేశపాక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రణాళికతో చదువు..లక్ష్యం దిశగా కదులు

- పోలీస్ ఉద్యోగార్థులకు ఎస్పీ సూచనలు
- జిల్లా పోలీస్ శాఖా ఉచిత శిక్షణా తరగతులు
- శిబిరాన్ని సందర్శించి స్టడీ మెటీరియల్ అందజేత



**ఆదిలాబాద్ మహా**: కష్టపడి చదివితే ఉద్యోగం సాధించడం తథ్యమని, ప్రతి అభ్యర్థి లక్ష్యంపై దృష్టి సారించి క్రమశిక్షణతో చదువుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు . జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక డిటిసి కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. కానిస్టేబుల్, ఎస్సై ప్రాథమిక పరీక్షల ఉచిత శిక్షణ తరగతులకు సుమారు 380 మంది అభ్యర్థులు హాజరవుతన్నారు. ప్రతిరోజూ తరగతుల్లో బోధించిన అంశాలను అదే రోజు సొంతంగా రివిజన్ చేసుకోవాలని తెలిపారు. పరీక్ష రాసే వరకు ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ పరీక్షలకు అనుగుణంగా అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ స్టడీస్, హిస్టరీ, పాలిటీ, ఇంగ్లీష్, మెంటల్ ఎబిలిటీ తదితర అంశాలతో రూపొందించిన నూతన స్టడీ మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో సుమారు 300 మంది అభ్యర్థులకు అందజేశారు. అభ్యర్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ప్రాథమిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖలో చేరాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలని, రానున్న ప్రాథమిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి. మౌనిక ఐపీఎస్, ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగరాజు, ఆదిలాబాద్ రూరల్ ఎస్సై లు వి. విష్ణువర్ధన్, ప్రవీణ్, అధ్యాపకుడు సాయి ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

- ఆదిలాబాద్ నియోజకవర్గ నలుమూలలనుండి తరలివచ్చిన ప్రజలు
- తమ సమస్యలపై కంది శ్రీనివాస రెడ్డికి వినతులు
- పరిష్కారానికి కృషి చేస్తానని కంది హామీ



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణం లోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన కనిపించింది. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ దర్బార్ లో నియోజకవర్గం లోని నలు మూలల నుండి ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజలు పార్టీ శ్రేణులు తమ సమస్యల పై కంది శ్రీనివాస రెడ్డి కి వినతి పత్రాలు అందించారు.ఇందిరమ్మ ఇండ్లు, సీయంఆర్ఎఫ్, పెన్షన్లు ,భూములకు సంబంధించిన విషయాలపై ఆయనను తమ సమస్యలు చెప్పుకొని దరఖాస్తులు అందించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆయన ఓపికగా అందరి సమస్యలు విని వినతులు స్వీకరించారు. వాటిపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.వెంట వెంటనే దరఖాస్తులను క్యాంపు కార్యాలయ సిబ్బంది కంప్యూటర్ లో అప్లోడ్ చేసారు. ప్రజల సమస్యలపై అందిన దరఖాస్తులను కంప్యూటరీకరించేందుకు తన కార్యాలయంలోనే ఒక సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు ఆయ తెలిపారు. దీని ద్వారా పరిష్కార అప్డేట్స్ వెనువెంటనే తెలుసుకునే అవకాశముంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ నాయకులతో పాటు బేల, భోరజ్, జైనథ్, మావల ఆదిలాబాద్ రూరల్ సాత్నాల మండల నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పాక పుల్లయ్య మృతి బాధాకరం

**ఊట్కూరి అశోక్ గౌడ్**
**బిజెపి జిల్లా అధ్యక్షులు**

**వలిగొండ అక్టోబర్ 1 మహా న్యూస్ :** మండలంలోని లోతుకుంట గ్రామానికి చెందిన బిజెపి నాయకులు మాజీ సర్పంచ్ పాక పుల్లయ్య బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ సీనియర్ నాయకులు పాశం భాస్కర్ అంతిమయాత్రలో పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు పాక పుల్లయ్య మృతి బాధాకరమని అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ కొప్పుల యాదిరెడ్డి నాయకులు బంధారపు లింగస్వామి రాచకొండ కృష్ణ అశోక్ రెడ్డి రామ్ నర్సు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమకారులను గుర్తించడంలో కాలయాపన ఎందుకు?

**సంగిశెట్టి క్రిస్టఫర్**
**టీఎంయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు**

**భువనగిరి , మహా :** త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో త్యాగాలు చేసిన ఉద్యమకారులను గుర్తించడంలో కాలయాపన ఎందుకు జరుగుతుందో చెప్పాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. ఉద్యమకారుల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులను గుర్తించడం ఆలస్యమే అయితే ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని అలాకాకుండా ఉద్యమకారులను గుర్తించి ఉద్యమకారుల ఆశీస్సులతో మరోసారి అధికారంలోకి రావాలని ఆయన అన్నారు ప్రభుత్వం వేసిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అన్ని సంఘాల తోటి అన్ని రాజకీయ పార్టీల తోటి సంప్రదింపులు జరిపి మూడు నెలలు అవుతున్నప్పటికీ నేటి వరకు ఎందుకు కాలయాపన చేస్తుందో అర్థం కావడం లేదు అన్నారు రాష్ట్రం కోసం తమ సర్వస్వాన్ని ధార పోసిన ఉద్యమకారులు రక్తాన్ని చిందించి స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులకే అన్యాయం చేస్తే చరిత్ర క్షమించదని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గుర్తించి చరిత్ర తిరగరాయాలని క్రిస్టఫర్ డిమాండ్ చేశారు ఈ సమావేశంలో సంగిశెట్టి జనార్దన్ కొండాపురం శ్రీనివాస్ గడ్డమీది పరశురాములు తదితరులు పాల్గొన్నారు

# కష్టార్జితం కరిగిపోతుంటే... సహారా బాధితుల రోదన

- మందమర్రి సహారా కార్యాలయం ముందు బాధితుల ఆందోళన



**మందమర్రి, మహా** :రేపటి భవిష్యత్తు కోసం.. పిల్లల పెళ్లిళ్ల కోసం.. కష్టపడి కూడబెట్టుకున్న ప్రతి రూపాయి కళ్ల ముందే ఆవిరైపోతుంటే గుండె తరుక్కుపోతోందని సహారా బాధితులు ఆందోళన బాట పట్టారు. ఎన్నో ఏళ్ల కలలతో దాచుకున్న ఆ సొమ్ము తిరిగి రాకపోతే మేం బతికి లాభం ఏంటి.? అంటూ మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో సహారా డిపాజిట్ బాధితులు గురువారం సహారా బ్యాంకు కార్యాలయం ముందు కన్నీరుమున్నీరుగా విలపించారు. జీవితాంతం పడ్డ కష్టాన్ని నమ్మి సహారా సంస్థలో డిపాజిట్ చేసిన వందలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు, మెచ్యూరిటీ తీరినా డబ్బులు రాక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మోసపోయామని గ్రహించి గురువారం మందమర్రిలోని సహారా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

**కన్నీటి గాథలు.. గుండెల్ని పిండేసే ఆవేదన**

ఇంటికి ఏ ముఖం పెట్టుకొని వెళ్లాలి అంటూ ఒక వృద్ధురాలు తన కష్టాలను తలుచుకుంటూ కార్యాలయం ముందు బోరున విలపించిన తీరు అక్కడున్న అందరి చేత కంటతడి పెట్టించింది. రెక్కలు ముక్కలు చేసుకొని, పూటగడవకపోయినా కూడబెట్టిన డబ్బులివి. ఇప్పుడు మా కష్టాన్ని ఎవరో దోచుకుపోతే మేం ఎవరికి చెప్పుకోవాలి..? కుటుంబ సభ్యులకు ఏం సమాధానం చెప్పాలి..? అంటూ ఆమె పడిన వేదన అందరినీ కలచివేసింది.

**నమ్మించి మోసం చేసిన ఏజెంట్లు**

సామాన్యుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని, నమ్మకంగా డిపాజిట్లు చేయించిన ఏజెంట్లు ఇప్పుడు ముఖం చాటేశారు. సంస్థ చేతులెత్తేయడంతో ఏజెంట్లు కూడా తమకూ ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా మాట్లాడటం బాధితులను మరింత నిస్సహాయ స్థితిలోకి నెట్టింది.

**తాళాలు వేసిన తలుపులు, ఆశల సమాధి**

ఏళ్ల తరబడి నమ్మి డబ్బులు కట్టిన సంస్థ, ఇవాళ కనీసం తలుపులు కూడా తెరవకుండా తాళాలు వేసి ఉండటం బాధితుల ఆగ్రహాన్ని, ఆవేదనను మరింత పెంచింది. ఎన్నో ఆశలతో కార్యాలయానికి వస్తే కనిపించిన ఆ తాళం చెవులు వారి భవిష్యత్తుపై పడిన పెద్ద నీడలా మారాయి. న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్మును తిరిగి ఇప్పించాలని పాలక పార్టీ , ప్రతిపక్ష, కమ్యూనిస్టు భావాజాల నేతలు జిల్లా ప్రభుత్వ అధికారులకు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ లను వేడుకుంటున్నారు. తక్షణమే స్పందించి సహారా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, తమ డిపాజిట్లను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్జెల్లి వెంకటయ్య, రేణికుట్ల కొమురయ్య, సంజీవ్, దండు రాజమౌళి, సత్యనారాయణ, సదానందం, చిట్టూరి శ్రీనివాస్, ముబీన్, కుమార్, శ్రీనివాస్, చంద్రయ్య తదితర బాధితులు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి!

- విద్యార్థులకు అవగాహన కల్పించిన పెద్దపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్ విభాగం

**పెద్దపల్లి మహా** : రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జోన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్దపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్ విభాగం సంయుక్తంగా మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, పొగాకు ఉత్పత్తులు తదితర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, మానసిక, సామాజిక దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు ఆకర్షితులై విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు విద్య, భవిష్యత్తుపై దృష్టి సారించాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ జె. లక్ష్మణ్‌రావు, పెద్దపల్లి టౌన్ ఎస్ఐ, ఆర్ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, రామగుండం నార్కోటిక్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాలను నివారించాలి..

**రాజేంద్రనగర్ మహా :** గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని సిద్ధాంతి హనుమాన్ టెంపుల్, ఆర్జీఐ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్ పరిసరాల్లో ప్రాంతంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి, ఈనేపథ్యంలో, ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారానికి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్, నేషనల్ హైవే డి ఈ సరిత, ఇంజనీరింగ్ సెల్ ఇన్స్పెక్టర్ బిక్షపతి, ట్రాఫిక్ అడ్వైజర్ వెంకట్రామయ్యతో కలిసి ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాల వేగ నియంత్రణ చేయాలంటే డ్రంబుల్స్ ట్రిక్స్ ఏర్పాటు చేయాలి, వాటితో పాటు పూట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలన్నారు.పూట్ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి టెండర్ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రమాదాల నివారణకై తగు చర్యలు చేపట్టాలన్నారు.

# వయోవృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ చంద్రయ్య



**మంచిర్యాల, మహా** : వయోవృద్ధులు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, డీఆర్డీఓ కిషన్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవం, సలహాలు సమాజానికి ఎంతో అవసరమని, వారు సమాజానికి విలువైన సంపద అన్నారు. తల్లిదండ్రులు తమ ఆస్తులను పిల్లలకు బదలాయించిన తర్వాత నిర్లక్ష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సుమారు 35,250 మంది వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారని, పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం 2007 పై అవగాహన కల్పించారు. సెక్షన్ 23 ప్రకారం పిల్లలు నిర్లక్ష్యం చేస్తే ఆస్తి బదలాయింపును ఆర్డీఓ రద్దు చేయవచ్చని, సెక్షన్ 24 ప్రకారం నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు, జరిమానా ఉంటుందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే వారి జీతం నుంచి పోషణకు చెల్లింపులు చేయించే అవకాశం ఉందన్నారు. ప్రతి మంగళవారం డే కేర్ సెంటర్లలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వయోవృద్ధులు 14567 టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వయోవృద్ధులను అధికారులు ఘనంగా సన్మానించారు.

# సత్తుపల్లి సింగరేణిలో కొత్త గనుల విస్తరణకు కసరత్తు



**సత్తుపల్లి, అక్టోబరు 1:మహా :** సత్తుపల్లి సింగరేణి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి పెంపుతో పాటు భవిష్యత్ గనుల విస్తరణకు కార్యాచరణపై సంస్థ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు గురువారం సత్తుపల్లి ఏరియాలో విస్తృతంగా పర్యటించి జేవీఆర్ ఓసీ2 పనితీరును పరిశీలించారు. జేవీఆర్ ఓసీ2లో బొగ్గు ఉత్పత్తి పురోగతి, నాణ్యత, రవాణా తీరును డైరెక్టర్ సమీక్షించారు. జేవీఆర్ ఈపీసీ సీఎచ్‌పీ ద్వారా బొగ్గు రవాణా, విజయవాడ రహదారి మళ్లింపు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి, రవాణాలో ఎదురవుతున్న సమస్యలు, మౌలిక వసతుల అవసరాలపై ఆరా తీశారు.

**ఓసీ-3పై ప్రత్యేక దృష్టి**

అనంతరం ప్రతిపాదిత జేవీఆర్ ఓసీ3 ప్రాంతాన్ని డైరెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు సరిహద్దులు, భౌగోళిక పరిస్థితులు, సాంకేతిక అనుకూలత, బొగ్గు రవాణాకు ఉన్న అవకాశాలను అధికారులు వివరించారు. గని విస్తరణకు అనువైన ప్రాంతాలపై పరిశీలన కొనసాగించారు. తదుపరి ఏరియా జీఎం కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సత్తుపల్లి ఏరియాలో భవిష్యత్ ఉత్పత్తి పెంపు, నూతన ప్రాజెక్టుల పురోగతి, రవాణా మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. జేవీఆర్ ఓసీ3 ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన సాంకేతిక, కార్యాచరణ అంశాలపై సమీక్షించారు. డైరెక్టర్ పర్యటనలో ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకటచారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని గనుల పురోగతికి సంబంధించిన వివరాలను అందించారు.

# పోక్సో కేసులో కఠిన కారాగార శిక్ష

**మేడ్చల్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు.**



**జవహర్ నగర్, మహా:** .పోక్సో కేసులో నిందితుడికి కఠిన కారాగార శిక్ష పడ్డ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జోరిల్ల వెంకటయ్య (55) స్థానిక జ్యోతి (బాలాజీ నగర్) కాలనీలో నివసిస్తున్నారు. అతనిపై జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఐపిసి సెక్షన్ 354 పోక్సో చట్టం 2012 సెక్షన్ 12 మేడ్చల్ జిల్లాలోని అత్యాచారం విచారణ పరిష్కార కోసం నిందితుడికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ .3 వేల రూపాయల జరిమానా విధించారు. బాధితురాలికి 50 వేల రూపాయల పరిహారం చెల్లించాలని తీర్పు వెల్లడించింది. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ సైదులు మాట్లాడుతూ త్వరగా తీర్పు రావడం శుభ పరిణామం అన్నారు . చట్టం తమ పని తాము చేసుకబోతుందన్నారు. ప్రజలు చట్టాలను గౌరవించాలని, శాంతి భద్రతలు అసాంఘిక కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# టీపీసీసీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నక్క శ్రీనివాస్



క్యాతన్‌పల్లిమహా : టీపీసీసీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నక్క శ్రీనివాస్ నియమితులయ్యారు. రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ నాయకత్వంలో, రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి సూచనలతో పాటు క్యాతన్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఓడ్నాల శ్రీనివాస్ సహకారంతో ఈ నియామకం చేపట్టినట్లు మంచిర్యాల జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా నక్క శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎస్సీ సెల్ బలోపేతానికి, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.




# వీధి కుక్కల నియంత్రణకు వాహనాలు

**రాజేంద్రనగర్, మహా**: శంషాబాద్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ కె. చంద్రకళ గురువారం డాగ్ క్యాచింగ్ వాహనాలను ప్రారంభించారు. జోన్ పరిధిలో వీధి కుక్కల సమస్యను నియంత్రించడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తమ ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్య ఉంటే ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 04021111111కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజల సహకారంతో శంషాబాద్ జోన్‌ను పరిశుభ్రంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేస్తారని పేర్కొన్నారు.



# బాధ్యతగా పనిచేయాలి

- రిమ్స్ అభివృద్ధికి పాటు పడాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా హెచ్చరిక

**ఆదిలాబాద్ మహా**: రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు నిర్వహణలో లోపాలను పూర్తిగా సరిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం రిమ్స్ ఆడిటోరియంలో అధికారులు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు, యూనియన్ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.సిబ్బందికి నెలవారీ వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని, వేతనాల్లో అనధికారిక కోతలు విధిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేటాయించిన విధులను వదిలి ఇతర పనులకు వెళ్లే సిబ్బందిని ఉపేక్షించబోమన్నారు. సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో సిబ్బంది కొరతను అధిగమించేందుకు అవసరమైన మేరకు సిబ్బందిని పెంచాలని సూచించారు.రిమ్స్‌లోకి అనధికారిక ప్రవేశాలను అరికట్టేందుకు గతంలో అమల్లో ఉన్న పాస్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీల వెంట ఇద్దరు, ఇతర రోగుల వెంట ఒకరు లేదా ఇద్దరు సహాయకులకు మాత్రమే అనుమతి ఉండేలా గేటు వద్దే నియంత్రణ చేపట్టాలని సూచించారు.నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా ఆసుపత్రిలోకి ప్రవేశించకుండా సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలన్నారు. రిమ్స్ ప్రాంగణంలో గుట్కా నమలడం, ధూమపానం చేయడం, ప్లాస్టిక్, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడం వంటి చర్యలకు పాల్పడితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, సూపర్‌వైజర్లు తమ పరిధిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.రిమ్స్‌లో సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆన్‌లైన్ హాజరు నమోదు చేస్తున్నప్పటికీ, రిజిస్టర్‌లో ఉన్న 420 మందిలో 350 మంది మాత్రమే విధులకు హాజరవుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన 70 మంది హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ హాజరు వ్యవస్థలో ఉన్న సాంకేతిక సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. నవంబర్ నుంచి ఆన్‌లైన్ హాజరు ఆధారంగానే వేతనాలు విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11 కోట్ల నిధులతో రిమ్స్‌లో లిఫ్ట్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వీల్‌చైర్లు, హెచ్‌డీఎస్ నిధులతో కొనుగోలు చేసిన స్ట్రెచర్లను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆసుపత్రి వ్యర్థాలను మున్సిపల్ డంప్‌యార్డుకు తరలించేందుకు ప్రత్యేక ట్రాక్టర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను డిసెంబర్ 3లోగా పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అంతకుముందు రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధుల నిర్వహణ, వేతన సమస్యలు, ఇతర అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు.సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ సాధన, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరులో 143 శాతం బొగ్గు ఉత్పత్తి..

- లక్ష్యాన్ని అధిగమించిన మణుగూరు ఏరియా
- ఆరు నెలల్లో 61.75 లక్షల టన్నుల ఉత్పత్తి
- ఏరియా జీఎం దుర్గం రామచందర్ వెల్లడి




**మణుగూరు, మహా** : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా సెప్టెంబరు నెలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించి 143 శాతం ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఏరియా ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపు తదితర వివరాలను వెల్లడించారు. సెప్టెంబరు నెలలో 6 లక్షల 28 వేల 500 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 8 లక్షల 98 వేల 299 టన్నులు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. దీంతో నెలవారీ ఉత్పత్తి 143 శాతంగా నమోదైందన్నారు.అలాగే ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు 44 లక్షల 68 వేల టన్నుల లక్ష్యానికి గాను 61 లక్షల 75 వేల 526 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 138 శాతం సాధించినట్లు వివరించారు.

**62.37 లక్షల టన్నుల బొగ్గు రవాణా**

సెప్టెంబరు నెలలో 8 లక్షల 98 వేల 299 టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు జీఎం రామచందర్ తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రోగ్రెసివ్‌గా 62 లక్షల 37 వేల 474 టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా డిపార్ట్‌మెంటల్ ఓవర్‌బర్డెన్ తొలగింపునకు 10 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 9 లక్షల 35 వేల క్యూబిక్ మీటర్లు తొలగించి 94 శాతం సాధించినట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 64 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 53 లక్షల 31 వేల క్యూబిక్ మీటర్లు తొలగించి 83 శాతం సాధించినట్లు వివరించారు. పారిశ్రామిక సంబంధాలు మెరుగ్గానే ఉన్నాయని అందులో భాగంగానే పదవీ విరమణ, మెడికల్ ఇన్వాలిడేషన్, ఉద్యోగి మరణం తదితర సందర్భాల్లో సెప్టెంబరు నెలలో సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ, జీఐఎస్, ఎఫ్‌బీఐఎస్, జేపీఏఐఎస్, ఎల్ఎస్‌పీ, హెచ్‌బీఎల్ఆర్ఎస్, సీపీఆర్ఎంఎస్ఎన్ఈ సభ్యత్వ కార్డులు, కారుణ్య నియామకాలు, ఐఎంఈ, కార్యాలయ ఉత్తర్వులు తదితర ఉద్యోగ సంక్షేమ అంశాలకు సంబంధించిన కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం డి వెంకట రామారావు, ఏజీఎం (ఐఈడీ) సీహెచ్ రాంబాబు, ఏరియా ఇంజినీర్ వి మధన్ నాయక్, పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి బి శ్రీనివాసదారి, మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ అధికారి ఈ శ్రీనివాస్, డీజీఎం (సివిల్) జి శివప్రసాద్, డీజీఎం (ఏరియా వర్క్‌షాప్) టి. శ్రీకాంత్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ జ్యోతిర్మాయి, పర్యావరణ అధికారి జె. శ్రీనివాస్‌రావు, ఫైనాన్స్ మేనేజర్ పి రమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, డిప్యూటీ పీఎం బి శ్యామ్ ప్రసాద్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**పెద్దపల్లి, మహా:** విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. గోదావరిఖని శారదనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఆయన సతీమణి మనాలి ఠాకూర్‌తో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనస్సుతోనే విద్యార్థులు చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూలను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా ప్రోత్సహించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంపై అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



## పంచాయతీ వర్కర్స్ కు చీరల పంపిణీ

**దమ్మపేట ,మహా :** మాజీ వైస్ ఎంపిపి దారా మల్లిఖార్జునరావు తన జన్మదినోత్సవం సందర్భంగా గురువారం పంచాయతీ వర్కర్స్ కు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ తమకు ప్రతి ఏటా వైస్ ఎంపిపి దారా మల్లిఖార్జునరావు చీరలను పంపిణీ చేస్తూ పేదలకు అండగా ఉంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. ముందుగా పట్టణ పురోహితులు ,వారి సంస్థాన విద్వాంసులు కామవరపు విజయమారుతీ శర్మ మంత్రోశ్చరణతో జన్మదినోత్సవ కేక్ ను కట్ చేసి ,ఆశీర్వదించారు. పట్టణ ప్రముఖులు ,వివిద రాజకీయ పార్టీల నాయకులు ,సోషల్ సేవకులు ,లయన్స్ క్లబ్ దమ్మపేట , ఆర్యవైశ్య సంఘ సభ్యులు , పలువురు వైస్ ఎంపిపికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# వీడిన హరణి హత్య రహస్యం

- ప్రేమను నిరాకరించిందని హతమార్చిన ప్రియుడు
- మీడియా సమావేశంలో వెల్లడించిన డీఎస్పీ



**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలో ఇటీవల కలకలం రేపిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఇంద్రపల్లి హరణి హత్య రహస్యాన్ని పోలీసులు ఛేదించారు. తన ప్రేమను నిరాకరించిందని కోపంతో ప్రియుడే హరణి నీ అతి కిరాతకంగా గొంతుకు ఉచ్చు బిగించి చంపినట్లు డీఎస్పీ ఆదినారాయణ గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. వెంగన్నపాలెం గ్రామానికి చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఇంద్రపల్లి హరణి (18) సెప్టెంబర్ 22న ఇంటి వద్ద అనుమానస్పదంగా చనిపోయి ఉందని, అదే గ్రామానికి చెందిన దేవరకొండ ప్రవీణ్ కుమార్ పై తనకు అనుమానం ఉందని తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శవపరీక్ష నివేదిక ప్రకారం మృతురాలి మెడకు బలమైన ఉచ్చు బిగించడం వలన చనిపోయినట్లు తేలడంతో, పోలీసులు ఈ కేసులో అనుమానితుడు ప్రవీణ్ కుమారును పట్టుకునేందుకు వలపన్నెరు. పరారీలో ఉన్న దేవరకొండ ప్రవీణ్ కుమార్ గురువారం జూలూరుపాడు ప్రాంతంలోని ఒంటి గుడిసె సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వద్ద ఉన్నట్లు విశ్వసనీయ సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరస్తుడు నేరం చేసిన తర్వాత ద్విచక్ర వాహనంపై పరారై నిర్మానుష ప్రదేశంలో వాహనాన్ని వదిలి పారిపోయినట్లు తెలిపారు. గురువారం ఆ వాహనాన్ని తీసుకుని పట్టణ ప్రాంతంలో రాపిడో వర్క్ చేసుకుంటూ బ్రతుకుదామని వచ్చిన నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుండి బైకు, రెండు సెల్ ఫోన్ లు ( ఒకటి మృతురాలిది) హత్యకు ఉపయోగించిన క్లచ్ వైర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నేరస్తుడు ప్రవీణ్ కుమార్ ను అరెస్ట్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు డిఎస్పి ఆదినారాయణ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై జీనత్ కుమార్, మనీషా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# అసంక్రమిత వ్యాధుల గుర్తింపుకు వైద్య పరీక్షలు..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విప్పలసింగారం గ్రామంలో గురువారం అసంక్రమిత వ్యాధుల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్తులకు షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి అనుమానితులను గుర్తించి మెరుగైన వైద్య పరీక్షల కోసం ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఇప్పటికే మందులు వాడుతున్న వారికి నెలవారీగా అవసరమైన ఔషధాలను అందజేశారు. అనంతరం డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గృహాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న కంటైనర్లను పరిశీలించి వాటిలో దోమల లార్వా ఉన్న చోట వెంటనే తొలగించే చర్యలు చేపట్టారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా చర్యలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌వీ జానకి మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన తాగునీటినే వినియోగించాలని, దోమలు పుట్టకుండా, దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, లక్ష్మి, పగిమ్మ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పేద కుటుంబాలకు అండగా సంక్షేమ పథకాలు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని 14 గ్రామ పంచాయతీలు, మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాల కింద 33 మంది లబ్ధిదారులకు చెక్కులను పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. మణుగూరులోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతోందని, నిత్యావసర సరుకులతో పాటు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఈ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆడబిడ్డల వివాహ సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాల కింద 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ ఆర్థిక సహాయం వివాహ సమయంలో కుటుంబాలకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా తన వంతు కృషి కొనసాగిస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ రామారావు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, సివిల్ సప్లై అధికారి, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వయోవృద్ధులు గతాన్ని మరచి వర్తమానాన్ని ఆనందంగా గడపాలి

- తమ విలువైన అనుభవాలను భావితరాలకు అందించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, కలెక్టరేట్ మహా:** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో వయోవృద్ధుల అనుభవాలు ఎంతో కీలకమన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' కార్యక్రమంలో విశ్రాంత విద్యావంతులు విద్యార్థులతో అనుభవాలను పంచుకోవడం అభినందనీయమన్నారు. దీంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మాట్లాడే సామర్థ్యం పెరుగుతున్నాయని తెలిపారు. వయోవృద్ధులు తమ ఆస్తిపాస్తులను తమ వద్దే ఉంచుకోవాలని, అవసరమైతే వీలునామా రాయాలని సూచించారు. ముందుగానే సేల్ డీడ్ లేదా గిఫ్ట్‌డీడ్ చేయకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. సమస్యలు ఎదురైతే 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. వయోవృద్ధులు తమ హక్కులు, సంక్షేమ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అధికారులు కోరారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టానికి సంబంధించిన గైడ్ పుస్తకాలను కలెక్టర్ ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయనున్న అవగాహన డిస్ప్లే బోర్డును ప్రారంభించారు. వయోవృద్ధులతో ప్రతిజ్ఞ చేయించారు. రైల్వే ప్రయాణాల్లో గతంలో ఉన్న 40 శాతం రాయితీని పునరుద్ధరించాలని కోరుతూ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



# రైతుల పట్టా పాస్‌బుక్కులు బూచిగా చూపి పార్టీలు మారుతున్నారు

**రాజేంద్రనగర్, మహా**: రైతుల పట్టా పాస్‌బుక్కులను బూచిగా చూపిస్తూ పార్టీలు మారుతున్నారని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాశ్‌గౌడ్ ఎన్నికల సమయంలో బహదూర్‌గూడ, న్సిమియాగూడ, కొత్వాల్‌గూడ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతి ఎన్నికల్లో అవే హామీలను పునరావృతం చేస్తున్నారని విమర్శించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు కార్తీక్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. శంషాబాద్ మండలంలోని బహదూర్‌గూడ, ఘన్సిమియాగూడ, కొత్వాల్‌గూడ ప్రాంతాల్లో భూ సమస్యలు తరతరాలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. బహదూర్‌గూడ భూ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని పలుమార్లు హామీ ఇచ్చినా రైతులకు న్యాయం జరగలేదన్నారు. హనుమాన్‌నగర్ వాసుల పట్టాల సమస్యను పరిష్కరించడంలోనూ ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు తీసుకుంటే నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూములు తీసుకుని త్యాన్నాయంగా స్థలం ఇస్తామని చెప్పే నిబంధన ఏ చట్టంలో ఉందో ఎమ్మెల్యే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బహదూర్‌గూడ రైతుల సమస్యపై బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని, నియోజకవర్గంలోని భూ సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు.



# రుద్రాక్షపల్లిలో అభివృద్ధి వరాల జల్లు

- రూ.4 కోట్లతో మౌలిక వసతుల కల్పన.. 28 సీసీ రోడ్ల ప్రారంభం
- 1,200 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. భద్రతకు నిఘా కెమెరాలు

**సత్తుపల్లి, మహా:** రుద్రాక్షపల్లి పంచాయతీ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సుమారు రూ.4 కోట్లతో చేపట్టిన పలు పనులకు సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గురువారం శ్రీకారం చుట్టారు. పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పంచాయతీ పరిధిలోని ప్రజలకు సుమారు 1,200 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రుద్రాక్షపల్లి, కొమ్ముగూడెం, బాసారం, తోగ్గుడెం, రంగాపురం, సత్యంపేట గ్రామాల్లో నిర్మించిన 28 సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సత్తెమ్మగుడి రహదారి, మూడు శ్రీశక్తి భవనాలు, ఆర్వో నీటి శుద్ధి కేంద్రం, సౌర మోటార్లు, సౌర విద్యుత్ దీపాలు తదితర పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో 42 ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

**భద్రతకు నిఘా కెమెరాలు**

గ్రామంలో ప్రజల భద్రత, నిరంతర పర్యవేక్షణ కోసం 10 నిఘా కెమెరాలు, టీవీని ఎమ్మెల్యే ప్రారంభించారు. రుద్రాక్షపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలకు అవసరమైన కట్టెలను ఉచితంగా అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రజలకు అవసరమైన సౌకర్యాలను చేరువ చేయడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, ఎంపీడీవో, రుద్రాక్షపల్లి సర్పంచ్ పాయం నాగేంద్రబాబు, ఉపసర్పంచ్ భూపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు భరత్‌కుమార్ బత్తుల, దామోదర్‌రావు పిన్నమనేని, హలావత్ అర్జున్, వసంతరావు, సారా రవి, సోయం సత్యం, తాటి నాగేష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు, ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి

**చేనేత క్లాస్టర్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్,పోచమ్మ మైదాన్ :** వరంగల్ జిల్లాలోని కొత్తవాడ లోని మట్టేవాడ, దయానంద్ చేనేత క్లస్టర్లను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి, అక్కడి ఉత్పత్తుల తయారీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. చేనేత కార్మికులకు అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహకారం, మార్కెటింగ్ సదుపాయాలపై అధికారులతో చర్చించారు. స్థానికంగా తయారయ్యే చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడంతో పాటు, ఆన్‌లైన్ మార్కెటింగ్, ఈకామర్స్ వేదికల ద్వారా ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు, అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరంగల్ ఎక్స్‌పోర్ట్ హబ్‌ను వినియోగించుకుని జిల్లాలో తయారయ్యే చేనేత, ఇతర స్థానిక ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలను పెంపొందించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ లో అభివృద్ధి చెందుతున్న పర్యాటక రంగాన్ని అనుసంధానం చేసుకుని స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలన్నారు. చేనేత కార్మికులు, ఉత్పత్తిదారుల సంఘాలకు అవసరమైన సాంకేతిక శిక్షణ, నాణ్యత ప్రమాణాలు, బ్రాండింగ్, ప్యాకేజింగ్ తదితర అంశాల్లో సహకారం అందించి, వరంగల్ చేనేత ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారినరసింహ మూర్తి, మరియు రాష్ట్ర చేనేత వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, తదితర చేనేత కార్మికులు, జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# కాంగ్రెస్ నేత గోపిశెట్టి వెంకటేశ్వర్లును పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి..

**తల్లాడ, మహా :** తల్లాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గోపిశెట్టి వెంకటేశ్వర్లును రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇండస్ట్రియల్ చైర్మన్ మువ్వా విజయబాబు పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యం తో బాధపడుతున్న ఆయనను మంత్రి పొంగులేటి పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తల్లాడ పట్టణ అధ్యక్షులు, నీలాద్రి ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, తుమ్మలపల్లి రమేష్, ఎర్రి నరసింహారావు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పట్టభద్రుల చేతిలో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదు!

**జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం , మహా:** రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల చేతిలో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యువత , నిరుద్యోగులు , ఉద్యోగులు , విద్యార్థులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి పట్టభద్రులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి యేడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పట్టుమని పదివేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ ను అసెంబ్లీలో ప్రకటించి కూడా అమలు చేయలేదని విమర్శించారు. నెలకు నాలుగు వేల నిరుద్యోగ భృతి హామీని కూడా కాంగ్రెస్ గాలికి వదిలేసిందని అన్నారు. తెలంగాణలో ఉద్యోగాల నోటిఫికేషన్లు వద్దని నిరుద్యోగులు ధర్నాలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రకటించి నిరుద్యోగులను అవమానించారని ఆయన మండిపడ్డారు. అధికారంలోకి రాగానే మెగా డిఎస్సీ ఇస్తామని చెప్పి గద్దెనెక్కి మోసం చేశారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఆరు డిఎలను పెండింగులో పెట్టారని చెప్పారు. పీఆర్సీ , ఓపీఎస్ , సిహెచ్ఎస్ లు ఎండమావిగా మారాయని విమర్శించారు. విద్యార్థులకు తొమ్మిది వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి అవస్థలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ ముందుంటుందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి , దండెం రాంరెడ్డి , మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి , మాజీ ఎంపిపిలు కృపేష్ , నర్మద , మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు , కిషన్ గౌడ్ , రమేష్ గౌడ్ , చీరాల రమేష్ , మున్సిపల్ అధ్యక్షులు కొప్పు జంగయ్య , అల్వాల్ వెంకట్ రెడ్డి , కళ్యాణ్ నాయక్ , బలరాం , సీనియర్ నాయకులు బూడిద రాంరెడ్డి , కందాడి లక్ష్మారెడ్డి , చిన్నయ్య , రాజు , జగదీష్ , అంజిరెడ్డి , రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ గర్జన సభకు స్థల పరిశీలన



**రాజేంద్రనగర్, మహా:** ఓబీసీ కుల గణనను చేపట్టాలనే ప్రధాన డిమాండ్‌తో అక్టోబర్ 4న నిర్వహించనున్న రంగారెడ్డి జిల్లా ఓబీసీ గర్జన సభకు గురువారం శంషాబాద్ మండలం తొండుపల్లిలో నాయకులు స్థల పరిశీలన చేశారు. తెలంగాణ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ వి.హనుమంత రావు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పారిజాత నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు మైదానాన్ని పరిశీలించారు. ఎనిమిది నియోజకవర్గాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వేదికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఓబీసీల జనాభా ప్రాతిపదికన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కుల గణన ద్వారా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా స్పష్టంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, ప్రభుత్వ ఉద్యోగాల్లో మరింత న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగించాలని కాంగ్రెస్ కోరుతోందన్నారు.

# త్రాగునీటి సమస్యను పరిష్కరించండి

**గోర్ బంజారా జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్**

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధి కొమ్ముగూడెం గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ నాయక్ అధికారులను పత్రిక ప్రకటనలో కోరారు. పంచాయితీ మోటారు నడవక, మిషన్ భగీరథ నీరు అందక గ్రామంలో సుమారు 50 కుటుంబాలు త్రాగునీటితోపాటు నిత్యవసరాలకు నీరు లేక నాన్న అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు గడుస్తున్న పాలకులు, అధికారులు ప్రజల బాధలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రజలు దూరప్రాంతాల నుండి మీరు తెచ్చుకునేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించకపోతే గ్రామస్తులతో కలిసి ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

# ఓబీసీ కులగణన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ మహా ;** జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ 4వ తేదీన జరగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఓబీసి సభ ఏర్పాట్లపై రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్ పల్లి తన నివాసంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గురువారం ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. 4వ తేదీన జరగబోయే ఓబీసీ కులగణన సాధన సభను జేంద్రనగర్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దిశానిర్దేశం చేశారు

# పాత్రికేయులపై బురద జల్లడం తగదు

**పాత్రికేయ వృత్తిని... మంట గలపకండి**
**పోలీసులకు పాత్రికేయుల ఫిర్యాదు.**



**జవహర్ నగర్, మహా :** స్థానిక పాత్రికేయులపై బురద జల్లడం తగదని ప్రభుత్వ భూముల కబ్జాలతో వారిని ముడి పెడుతూ కించపరిచే కథనాలు ప్రచురించడం తగదని స్థానిక పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో ప్రభుత్వ భూముల కబ్జాల వ్యవహారంలో జవహర్ నగర్ స్థానిక విలేకరుల హస్తం ఉందంటూ ఆధారాలు చూపకుండా ఆరోపణలు చేయడం స్థానిక పాత్రికేయులను కించపరిచే కథనాలు ప్రచురించడం తగదని స్థానిక విలేకరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో స్థానిక పాత్రికేయులందరూ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గత మూడు రోజులుగా జవహర్ నగర్ లో ప్రభుత్వ భూముల కబ్జాల వెనుక స్థానిక పాత్రికేయుల హస్తం ఉందనే ఆరోపణలతో ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. దీనికి తోడు జవహర్ నగర్ లో సుమారు 200 మంది విలేకరులు ఉన్నారని వారిలో కొందరికి పెన్ను పేపర్ ఇస్తే సొంత పేరు కూడా రాయడం రాదని రీతిలో అవమానకర వ్యాఖ్యలు ప్రచురించడం స్థానిక విలేకరుల వృత్తిపరమైన గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కొన్ని పత్రికల్లో ఇటువంటి వ్యాఖ్యలతో కూడిన కథనాల ప్రతులను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల పేర్కొన్నారు ఇలాంటి నిర్దిష్ట ఆధారం లేకుండా పాత్రికేయులందరినీ ఒకే ఘాటాన కట్టి కించపరిచేలా విష ప్రచారం చేయడం తగదన్నారు.

**ఆధారాలుంటే బయటపెట్టాలి.**
ప్రభుత్వ భూముల కబ్జాలో నిజంగా ఎవరైనా విలేకరుల ప్రమేయం ఉంటే వారి పేర్లతో పాటు సంబంధిత ఆధారాలను పోలీసులకు రెవెన్యూ అధికారులకు అందించాలని స్థానిక విలేకరులు స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని రక్షించాల్సిన అవసరం తమకు లేదని తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సిందేనని అన్నారు. అయితే కొందరిపై ఆరోపణలు ఉన్నాయని కారణంతో జవహర్ నగర్ లో విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులందరినీ కబ్జాలతో ముడిపెట్టి వారి వృత్తిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఇటువంటి ప్రచారం నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుల గౌరవ ప్రతిష్ట లకు భంగం కలిగించడంతోపాటు ప్రజల్లో అపోహలకు కారణం అవుతుంది అని తెలిపారు.

**తప్పుడు కథనాలపై తప్పవు : : ఇన్స్పెక్టర్ సైదులు.**
పాత్రికేయుల ఫిర్యాదు పై జవహర్ నగర్ ఎస్హెచ్ఓ సైదులు స్పందించారు ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించి ఎవరైనా నిర్దిష్ట ఆధారాలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన ఆధారాలను పరిశీలించి వాస్తవాల ఆధారంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆధారాలు లేకుండా వ్యక్తులను లేదా పాత్రికేయులను లక్ష్యంగా చేసుకొని వారి గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ఆరోపణలు, ప్రచారాలు మానాలని హెచ్చరించారు. పాత్రికేయులు ఇచ్చిన ఫిర్యాదు పై నిష్పక్షిపాతంగా విచారణ చేపడతామని విచారణలో ఎవరైనా చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలితే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఇన్స్పెక్టర్ సైదులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విలేకరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంజాయి మత్తులో పోకిరీల ఆగడాలు

**కుషాయిగూడ, మహా:** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని ద్వారకాపురి కాలనీలో గంజాయి మత్తులో యువకుల ఆగడాలు పెరుగుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఖాళీ స్థలాలు అధికంగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని కొందరు యువకులు రాత్రివేళల్లో అక్కడ గంజాయి సేవిస్తూ గుంపులుగా చేరుతున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ద్వారకాపురి కాలనీతో పాటు మధురానగర్, మీనాక్షినగర్, సోనియాగాంధీనగర్ కాలనీల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**అర్ధరాత్రి వేళల్లో గుంపులుగా..**
ఖాళీ స్థలాల్లో అర్ధరాత్రి వరకు గంజాయి సేవిస్తూ కొందరు యువకులు హల్‌చల్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని 'ఇక్కడ ఎందుకు ఉన్నారు?' అని ప్రశ్నిస్తే ఎదురు దాడులకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. దీంతో వారిని ప్రశ్నించేందుకు కూడా స్థానికులు వెనుకంజ వేస్తున్న పరిస్థితి నెలకొందని తెలిపారు.

**మహిళలు బయటకు రావాలంటే భయం**
గంజాయి మత్తులో ఉన్న యువకులు రాత్రివేళల్లో కాలనీల్లో సంచరిస్తుండటంతో మహిళలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వచ్చినా గుంపులుగా ఉన్న యువకులను చూసి ఆందోళన చెందుతున్నామని చెప్పారు. పాఠశాలలు, ఉద్యోగాలు, ఇతర పనుల నిమిత్తం రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వారిపైనా ప్రభావం పడుతోందని తెలిపారు.

**పోలీసులకు ఫిర్యాదు చేసినా..**
గంజాయి సేవిస్తున్న వారి ఆగడాలపై ఇప్పటికే కుషాయిగూడ పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాలనీల్లో రాత్రివేళల్లో గస్తీ పెంచడంతో పాటు ఖాళీ స్థలాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అనుమానాస్పదంగా గుంపులుగా చేరే వారిని గుర్తించి విచారించాలని, గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**నిఘా పెంచాలని విజ్ఞప్తి**
ఖాళీ స్థలాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసు గస్తీ పెంచి గంజాయి మత్తులో తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా కుషాయిగూడ పోలీసులు స్పందించి ద్వారకాపురి, మధురానగర్, మీనాక్షినగర్, సోనియాగాంధీనగర్ ప్రాంతాల్లో నిఘా పెంచి ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు: కలెక్టర్

**పెద్దపల్లి మహా :** పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. లెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యాసనా లోపాలను గుర్తించి పరిహార బోధనను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అక్టోబర్ నెలకు నిర్దేశించిన ప్రత్యేక అభ్యాసనాంశాల అమలుకు ప్రణాళిక రూపొందించాలని, దసరా సెలవుల్లోనూ విద్యార్థుల అభ్యాసనం కొనసాగేందుకు వారి స్థాయికి అనుగుణంగా ఇంటిపని ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలల క్షేత్రస్థాయి పర్యవేక్షణ, విద్యార్థుల అభ్యాసన స్థాయి అంచనాలపై సమీక్షించిన కలెక్టర్.. నిర్ణయించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకడమిక్ మానిటరింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# కత్తిమీద సాములాంటిది పోలీసు వృత్తి

**నిబద్ధతే పోలీసుల ప్రధాన ఆయుధం**

**తల్లాడ, మహా:** పోలీసు వృత్తి కత్తిమీద సాములాంటిదని, ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లను అధిగమిస్తూ చట్టబద్ధంగా విధులు నిర్వహించడం గొప్ప బాధ్యత అని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ అన్నారు. ప్రజా భద్రతే లక్ష్యంగా నిస్వార్థంగా సేవ చేయాలని సిబ్బందికి సూచించారు. తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో విధులు నిర్వహించి వివిధ ప్రాంతాలకు ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లుగా బదిలీపై వెళ్తున్న సిబ్బందికి బుధవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఎస్సై అందించిన సహకారం, ప్రోత్సాహం, మార్గదర్శకత్వాన్ని సిబ్బంది గుర్తుచేసుకున్నారు. పోలీసులు ఎన్ని సవాళ్లు ఎదురైనా నిష్పక్షపాతంగా, చట్టపరిధిలో పనిచేయాలని వెంకటకృష్ణ సూచించారు. ప్రజల సమస్యలను ఓపికగా విని పరిష్కరించేందుకు కృషి చేస్తే పోలీసులపై విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. ప్రజల సహకారంతోనే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.



# శేరిలింగంపల్లి సాక్షిగా.. ప్రభుత్వ భూమి యదేచ్ఛగా కబ్జా

- 300 గజాల్లో బేస్మెంట్ నిర్మాణం .. భారీ షెడ్ ఏర్పాటుకు పనులు ప్రారంభం
- చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



**మహా, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి రెవెన్యూ పరిధిలోని మియాపూర్ ప్రశాంత్ నగర్ 100 సర్వేనెంబర్ గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిగా సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉంది. నిబంధనల ప్రకారం ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే ఇక్కడ రాత్రికి రాత్రి భారీ నిర్మాణాలు షెడ్యూలు ప్రహరీ గోడలు రూములు వెలిసిపోతున్నాయి, వీటిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పరిశీలిస్తామంటూ కాలయాపన చేయడం అధికారుల అవినీతికి అద్దం పడుతుందనే విమర్శలు ఉన్నాయి . తాజాగా ఒక వ్యక్తి సుమారు 300 గజాల్లో బేస్మెంటు నిర్మించి భారీ షెడ్ నిర్మాణానికి రెడీ అవుతుండగా, మరో వ్యక్తి రూములు ప్రహరీ గోడలు నిర్మిస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినప్పటికి అధికారులు మాత్రం వారం రోజులుగా పరిశీలిస్తాం, చూస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికే చాలావరకు కబ్జాకారుల చేతుల్లోకి వెళ్లిపోయింది మిగిలిన కొంత భూమిని కూడా అధికారులు పరిరక్షించే దాఖలాలు కనపడటం లేదు. అక్రమ నిర్మాణాల విషయంలో ఎన్ని ఫిర్యాదులు అందుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం, నిర్మాణదారుల పట్ల ఉదాసీనత చూపించడం చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తోంది. శేరిలింగంపల్లి లోని కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు నిరంతరం అన్యాక్రాంతమవుతున్నా ప్రభుత్వ భూముల్ని కాపాడాల్సిన అధికారులు కబ్జారులకు కొమ్ముకాస్తూ ఏదో ఒక సాకు చెప్పి చర్యలు తీసుకోకుండా పరోక్షంగా సహకరిస్తున్నారని ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు జోక్యం చేసుకొని శేరిలింగంపల్లిలోని జరుగుతున్న అక్రమాల పట్ల అధికారుల అవినీతి పై పూర్తిస్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

# సమగ్ర సమాచారంతో దిశా సమావేశానికి రావాలి

**వరంగల్ బ్యూరో, మహా**: దిశా సమావేశానికి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో గురువారం ఆమె అధ్యక్షతన జరిగిన దిశా సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. పూర్తి వివరాలు లేకుండా సమావేశానికి వచ్చిన అధికారుల తీరుపై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై పథకాల పురోగతి, నిధుల వినియోగం, పూర్తయిన, పెండింగ్ పనులు, సమస్యలు, తీసుకుంటున్న చర్యలపై సమగ్ర వివరాలతో రావాలని ఆదేశించారు. కేంద్ర పథకాల అమలును అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖను కోరారు. గర్భిణీల వివరాలను 100 శాతం నమోదు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నియంత్రణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాద ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని, వరంగల్ మ్యూజియం అభివృద్ధికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



# జర్నలిస్టుల హక్కుల సాధనకై నేడు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన

- **టీయుడబ్ల్యూజె (ఐజెయు) భద్రాద్రి జిల్లా కమిటీ సభ్యులు మోదుగు ప్రభాకర్**

**జూలూరుపాడు, మహా:** జర్నలిస్టుల హక్కుల సాధన కోసం టీయు డబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో నిర్వహించే నిరసనలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కమిటీ సభ్యులు మోదుగు ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మోదుగు ప్రభాకర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఐజెయు సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ తీసుకున్నట్లు వెల్లడించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతోపాటు, భద్రాచలం, పినపాక, ఇల్లందు నియోజక కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, రక్షణ, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం ఐజెయు గళాన్ని బలంగా వినిపించాల్సిన అవసరం తలెత్తిందన్నారు. డిమాండ్ల సాధనకు జర్నలిస్టుల ఐక్యతతో ముందుకు కదలాలని మోదుగు ప్రభాకర్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని టీయుడబ్ల్యూజె సభ్యులు తమ తమ కేంద్రాల్లో జరిగే నిరసనలో పాల్గొని జర్నలిస్టుల సత్తా చాటాలన్నారు. అక్టోబర్ 2 తేదీ ఉదయం 11 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు భద్రాచలం, మణుగూరు, ఇల్లందు నియోజకవర్గం కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మన హక్కులు, భవిష్యత్తు, వృత్తి గౌరవం కోసం టీయుడబ్ల్యూజె నిర్వహించే నిరసనలో అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. జర్నలిస్టుల ఐక్యత ఉద్యమానికి బలమని, హక్కుల సాధనే లక్ష్యంగా యూనియా నేషనల్ కౌన్సిల్ సభ్యులు కమిటీ సభ్యులు బివి రమణారెడ్డి, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, జాగు వెంకటరత్నం, జిల్లా కార్యదర్శ జునుమల రమేష్ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జర్నలిస్టులకు మోదుగు ప్రభాకర్ పిలుపునిచ్చారు.




# మంగళపల్లి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు!

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 1 మహా:** మంగళపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నం.96లో 4.25 ఎకరాల ప్రభుత్వ భూమి, పట్టా భూమిగా మారినట్లు వెలుగులోకి వచ్చిన కథనాలపై, ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో సునీత రెడ్డి స్పందించారు. ఇబ్రహీంపట్నం మండలం, మంగళపెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని 96 సర్వే నెంబర్ గల 4.34 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, ఆ యొక్క భూమి ప్రభుత్వానికి చెందినదని పేర్కొంటూ, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ మాధవి, జిపిఓ సుదర్శన్, ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

# అల్లి కనకమ్మ మరణం తీరని లోటు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అల్లి కనకమ్మ మరణం ఆమె కుటుంబానికి తీరని లోటని అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి, సినీగీత రచయిత ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. మాజీ సింగరేణి ఉద్యోగి, గాయకుడు అల్లి శంకర్ తల్లి కనకమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆమె మృతదేహాన్ని సందర్శించిన మద్దెల శివకుమార్ నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కనకమ్మ తన పిల్లలను ఎంతో ప్రేమగా పెంచారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా పలువురు కళాకారులు, సంగీత దర్శకులు, సినీ రంగ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు కనకమ్మకు నివాళులు అర్పించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అల్లి శంకర్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్యారడైజ్‌లో పాత్రపై మోహన్ బాబు ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, మహా: నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమాలో సీనియర్ నటుడు మోహన్ బాబు కీలక పాత్రలో కనిపించారు. శికంజమాలిక్‌గా ఆయన పోషించిన పాత్ర ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా చిత్ర బృందంతో జరిగిన సంభాషణలో తన పాత్ర గురించి మోహన్ బాబు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. నాని అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని, అందుకే ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. అయితే దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తనకు పాత్ర గురించి మొదట చెప్పిన విషయాలకు, షూటింగ్ సమయంలో జరిగిన పరిణామాలకు తేడా ఉందని సరదాగా వ్యాఖ్యానించారు. తన పాత్రకు జోడీగా ఓ హీరోయిన్ ఉంటుందని ముందుగా చెప్పారని, షూటింగ్ ప్రారంభమైన తర్వాత ఆ విషయంలో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. సినిమాలో తనకు ఇచ్చిన పాత్ర చాలా కఠినమైనదని, ఇంతటి తీవ్రత ఉన్న పాత్రను చేయడం తనకు కొత్త అనుభూతిని ఇచ్చిందని మోహన్ బాబు చెప్పినట్లు సమాచారం. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల రూపొందించిన ఈ చిత్రంలో నాని ప్రధాన పాత్రలో నటించగా, మోహన్ బాబుతో పాటు పలువురు నటీనటులు కీలక పాత్రలు పోషించారు.



భాగ్యశ్రీ బోర్సే

# అందాల సందడి

భాగ్యశ్రీ బోర్సే తాజాగా ఆకాశ నీలం రంగు చీరలో మెరిసి అభిమానులను ఆకట్టుకున్నారు. సంప్రదాయ చీరకట్టులో ఆధునిక హంగులు జోడిస్తూ ఆమె చేసిన ఫొటోషూట్ ప్రత్యేకంగా నిలిచింది. లేత నీలం రంగు చీరపై అందమైన బంగారు ఎంబ్రాయిడరీ డిజైన్లు ఉండగా, దానికి క్రీమ్ కలర్ బ్లౌజ్‌ను జత చేశారు. చీరకు తగ్గట్టుగా మెడలో బంగారు చోకర్, చెవులకు అందమైన చెవిపోగులు, చేతికి బ్రేస్‌లెట్ ధరించి సంప్రదాయ లుక్‌లో కనిపించారు. సహజమైన బ్యాక్‌డ్రాప్‌లో చిరునవ్వులు చిందిస్తూ భాగ్యశ్రీ ఇచ్చిన ఫోజులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. సాధారణమైన మేకప్, సింపుల్ హెయిర్‌స్టైల్‌తో ఆమె తన అందాన్ని మరింత హైలైట్ చేశారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ ఫొటోలు ప్రస్తుతం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. చీరలో భాగ్యశ్రీ బోర్సే లుక్‌కు నెటిజన్ల నుంచి ప్రశంసలు వస్తున్నాయి.






# విడుదలకు ముందే దృశ్యం3 జోరు

ముంబయి, మహా: అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'దృశ్యం3'పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. అక్టోబర్ 2న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుండగా.. ఇప్పటికే అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ ఊపందుకున్నాయి. విడుదలకు ముందే టికెట్ల విక్రయాలు భారీగా నమోదవుతున్నట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ఇప్పటివరకు 5.35 లక్షలకు పైగా టికెట్లు విక్రయమైనట్లు తెలుస్తోంది. అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా దేశీయ మార్కెట్‌లో గణనీయమైన మొత్తంలో వసూళ్లు నమోదయ్యాయి. ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ముందస్తు విక్రయాలకు స్పందన లభిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కలు కొనసాగితే తొలి రోజు వసూళ్లు భారీ స్థాయిలో ఉండొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమా 'దృశ్యం2' అడ్వాన్స్ బుకింగ్ గణాంకాలను అధిగమించినట్లు సమాచారం. అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవగణ్ మరోసారి విజయ్ సల్గావ్కర్ పాత్రలో కనిపించనున్నారు. కుటుంబాన్ని కాపాడుకునే క్రమంలో ఎదురయ్యే పరిణామాల నేపథ్యంలో కథ కొనసాగనున్నట్లు తెలుస్తోంది. శ్రియా శరణ్, టబు, ఇషితా దత్తా, జైదీప్ అహ్లావత్, మృణాల్ జాదవ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

# ఎర్రచీరలో దీపికా

హైదరాబాద్, మహా: టీవీ యాంకర్, నటి దీపికా పిల్లి సంప్రదాయ చీరకట్టులో ఆకట్టుకున్నారు. ఎరుపు రంగు చెక్స్ డిజైన్‌తో ఉన్న చీరలో ఆమె చేసిన ఫొటోషూట్ ప్రత్యేకంగా నిలిచింది. బంగారు అంచుతో కూడిన చీరకు సరిపోయే బ్లౌజ్‌ను ధరించి సంప్రదాయ లుక్‌లో కనిపించారు. ముక్కుపుడక, బొట్టు, ఎరుపు రంగు గాజులు వంటి ఆభరణాలతో తన లుక్‌కు మరింత సంప్రదాయ హంగులు జోడించారు. పొడవాటి వేవీ హెయిర్‌ను ఒకవైపు వేసుకుని, సింపుల్ మేకప్‌తో ఫొటోలకు ఫోజులిచ్చారు. పాతకాలపు గోడను పోలిన బ్యాక్‌డ్రాప్‌లో దీపికా ఇచ్చిన పోజులు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎలాంటి హంగామా లేకుండా సంప్రదాయ వస్త్రధారణలో కనిపించిన ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఈ ఫొటోలు వైరల్‌గా మారుతున్నాయి. దీపికా పిల్లి తొలుత టెలివిజన్ రంగంలో యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 'కామెడీ స్టాక్ ఎక్స్ఛేంజ్' వంటి కార్యక్రమాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అనంతరం సినిమాల్లోకి అడుగుపెట్టి నటిగా తనకంటూ గుర్తింపు సంపాదించుకుంటున్నారు.



# ఆయుష్మాన్‌కు మళ్లీ సక్సెస్ అవసరం

**ముంబయి, మహా:** విభిన్న కథలను ఎంచుకుంటూ బాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు ఆయుష్మాన్ ఖురానా ప్రస్తుతం వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. కొంతకాలంగా ఆయన సినిమాలకు ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో.. రాబోయే చిత్రాలపై ఆసక్తి నెలకొంది. గతంలో తక్కువ బడ్జెట్‌లో రూపొందిన కంటెంట్ ఆధారిత చిత్రాలతో విజయాలు అందుకున్న ఆయుష్మాన్.. ఇటీవల భారీ స్థాయి కమర్షియల్ సినిమాల వైపు అడుగులు వేశారు. 'థామా', 'పతి పత్ని ఔర్ వో దో' చిత్రాల ఫలితాలు ఆయన కెరీర్‌లో కొత్త చర్చకు దారితీశాయి.ఈ నేపథ్యంలో ఆయుష్మాన్ నటించిన 'ఉడ్తా తీర్'పై అంచనాలు నెలకొన్నాయి. ఆకాష్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందిన ఈ స్పై కామెడీలో సారా అలీఖాన్ కథానాయికగా నటిస్తున్నారు. అక్టోబర్ 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీతో పాటు గూఢచర్యం అంశాలను మేళవించిన కథతో సినిమా రూపొందినట్లు చిత్రబృందం వెల్లడించింది. మరోవైపు సూరజ్ బర్జాత్యా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'యే ప్రేమ్ మోల్ లియా' కూడా ఆయుష్మాన్ కెరీర్‌లో కీలక చిత్రంగా మారనుంది. కుటుంబ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో శర్వరీ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 27న విడుదల కానుంది. వరుసగా విభిన్న జానర్లలో సినిమాలు చేస్తున్న ఆయుష్మాన్.. ఈ రెండు చిత్రాలతో ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తనకు గుర్తింపు తెచ్చిన కంటెంట్ ఆధారిత సినిమాల వైపు మరోసారి దృష్టి సారిస్తున్నట్లు ఇటీవల ఆయుష్మాన్ పేర్కొన్న నేపథ్యంలో రాబోయే చిత్రాలపై సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.



# లగ్జరీ లుక్‌లో ఆలియా భట్

**ముంబయి, మహా:** బాలీవుడ్ నటి ఆలియా భట్ మరోసారి తన ప్రత్యేకమైన ఫ్యాషన్ స్టైల్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. ఇటీవల నిర్వహించిన ఓ ఫ్యాషన్ ఈవెంట్‌కు ఆమె మెరిసే సీక్విన్ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఫ్లోరల్ డిజైన్లతో రూపొందించిన టాప్, మినీ స్కర్ట్‌ను ధరించిన ఆలియా.. తన లుక్‌కు అనుగుణంగా ఖరీదైన ఆభరణాలు, హీల్స్‌ను ఎంపిక చేసుకున్నారు. సిల్వర్ టోన్‌లో మెరిసిన దుస్తులకు రంగురంగుల ఫ్లోరల్ డిజైన్లు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. నెక్లెస్, రింగ్స్‌తో పాటు స్టైలిష్ ఫుట్‌వేర్‌ను జత చేసుకోవడంతో ఆమె లుక్ మరింత ప్రత్యేకంగా కనిపించింది. సాధారణమైన హెయిర్‌స్టైల్, ఆకట్టుకునే మేకప్‌తో ఆలియా తన ఫ్యాషన్ లుక్‌ను పూర్తి చేశారు. ఆమె ధరించిన దుస్తులు, ఆభరణాల ధరలు కలిపి లక్షల రూపాయల్లో ఉన్నట్లు ఫ్యాషన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ లుక్‌కు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అభిమానులు ఆలియా ఫ్యాషన్ సెన్స్‌ను ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం సినిమాలతో పాటు ఫ్యాషన్ ఈవెంట్లలోనూ ఆలియా తన ప్రత్యేకమైన స్టైల్‌తో సందడి చేస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com